RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 87 | ఏప్రిల్ 17 శుక్రవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 87 | April 17 Fryday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


ఎండకు తట్టుకోలేక కొడుకు మృతి... ఆవార్త విని తల్లి మృతి 2

# సభ ముందుకు బిల్లులు

**అధికార ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు**



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

భారత పార్లమెంటరీ చరిత్రలో ఒక కీలక ఘట్టానికి నాంది పలుకుతూ, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు మరియు దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం మూడు కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. గురువారం పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమైన సందర్భంగా, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మరియు హోంమంత్రి అమిత్ షా ఈ బిల్లులను సభ ముందు ఉంచారు. ఈ బిల్లుల ప్రవేశాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకించడంతో సభలో ఉత్కంఠ నెలకొంది. డివిజన్ ఓటింగ్‌కు విపక్షాలు పట్టుబట్టగా, స్పీకర్ ఓం బిర్లా అందుకు అంగీకరించారు. ఓటింగ్ నిర్వహించగా, బిల్లును ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు పోలయ్యాయి. మెజార్టీ మద్దతుతో కేంద్రం ఈ బిల్లులను అధికారికంగా సభలో ప్రవేశపెట్టింది. బిల్లుల పరిశీలన కోసం లోక్‌సభ నిబంధన 66లోని ప్రొవైజోను సస్పెండ్ చేయాలని మంత్రి మేఘ్వాల్ కోరారు. ఈ బిల్లులపై సుదీర్ఘ చర్చ జరగనుండగా, శుక్రవారం సాయంత్రం 4 గంటలకు తుది ఓటింగ్ నిర్వహించనున్నట్లు స్పీకర్ ప్రకటించారు. రాజ్యాంగ సవరణ బిల్లు (131వ): లోక్‌సభ స్థానాలను

# ఎండల మంట..

## నిప్పుల కొలిమిగా తెలుగు రాష్ట్రాలు



**హైదరాబాద్/అమరావతి జన సంఘర్షణ**

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. గడచిన కొన్ని రోజులుగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వల్ల అకాల వర్షాల తర్వాత ఇప్పుడు వడగాలుల తీవ్రత పెరిగింది. మధ్యాహ్న సమయంలో రోడ్లు నిర్మానుష్యంగా

మిగతా 2వ పేజిలో..

# అమిత్ షా కౌంటర్

లోక్‌సభలో మహిళా రిజర్వేషన్లు మరియు డీలిమిటేషన్ బిల్లులపై జరిగిన చర్చలో భాగంగా అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మహిళా రిజర్వేషన్ల అమలులో జాప్యం, కులగణన అంశాలపై విపక్షాలు లేవనెత్తిన అభ్యంతరాలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా గట్టిగా తిప్పికొట్టారు. కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్లను 2024లోనే ఎందుకు అమలు చేయడం లేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఈ బిల్లుకు తమ పార్టీ 2023లోనే పూర్తి మద్దతు తెలిపిందని, ప్రభుత్వం రాజ్యాంగాన్ని హైజాక్ చేస్తోందని ఆయన ఆరోపించారు. మరోవైపు, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ, కులగణన లేకుండా ఈ ప్రక్రియను చేపట్టడంలో అంత తొందర ఎందుకని నిలదీశారు. మహిళా రిజర్వేషన్లకు తమ పార్టీ మద్దతు ఉంటుందని, కానీ డీలిమిటేషన్ ద్వారా వీటిని అమలు చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఎంఐఎం, డీఎంకే పార్టీలు కూడా ఈ సవరణలను రాజ్యాంగ విరుద్ధమైనవిగా అభివర్ణించాయి.

విపక్షాల విమర్శలపై హోంమంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. బిల్లును ప్రవేశపెట్టకముందే విమర్శలు చేయడం సరికాదని అసహనం వ్యక్తం

మిగతా 2వ పేజిలో..

# రాజకీయ కోణంలో చూడొద్దు : మోడీ


మహిళా రిజర్వేషన్ బిల్లు మరియు డీలిమిటేషన్ ప్రక్రియపై లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు. ఈ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని, ఇది ఏ ఒక్క పార్టీకో లేదా వ్యక్తికో దక్కే విజయం కాదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కే చారిత్రాత్మక ఘట్టమని ఆయన పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా మహిళలు ఎదురుచూస్తున్న ఈ రిజర్వేషన్లు వారికి కల్పిస్తున్న సౌకర్యం కాదని, అది వారి హక్కు అని స్పష్టం చేశారు. మహిళా సాధికారత లేని 'వికసిత్ భారత్' సంపూర్ణం కాదని, దేశాభివృద్ధిలో సగం జనాభాకు నిర్ణయాధికారం కల్పించడం అత్యంత అవసరమని మోదీ ఉద్ఘాటించారు. ఈ బిల్లుకు తనకే క్రెడిట్ కావాలని తాను ఆశించడం లేదని, దీనిని ఏకగ్రీవంగా ఆమోదించడం ద్వారా ఆ క్రెడిట్ దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బిల్లును వ్యతిరేకిస్తున్న వారిపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని వస్తున్న ఆరోపణలను ప్రధాని కొట్టిపారేశారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ ప్రాంతీయ భేదాలను సృష్టించి దేశాన్ని ముక్కలు చేసే ప్రయత్నాలను ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని, చిన్న రాష్ట్రాలకైనా, పెద్ద రాష్ట్రాలకైనా ఎలాంటి అన్యాయం

మిగతా 2వ పేజిలో..

## పార్టీ మారిన వారందరూ

# వివరణ ఇవ్వాలి

## తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు



**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్న పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేల అనర్హత వేటు వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 9 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును

మిగతా 2వ పేజిలో..

## తెలుగు రాష్ట్రాల్లో

# సీట్లు పెరుగుతాయి

### అమిత్ షా స్పష్టం

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

లోక్‌సభలో మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లులపై జరిగిన చర్చ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న విపక్షాల వాదనను ఆయన పూర్తిగా ఖండించారు. ఇది కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చేస్తున్న దుష్ప్రచారం అని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య భారీగా పెరగబోతోందని, ఇది అక్కడి జనాభా ప్రాతిపదికన ఆశించిన దానికంటే ఎక్కువగా ఉంటుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా అమిత్ షా తాజా గణాంకాలను వెల్లడించారు: తెలంగాణలో లోక్‌సభ స్థానాల సంఖ్య ప్రస్తుతమున్న 17 నుండి 26కు, ఆంధ్రప్రదేశ్‌లో 25 నుండి 38కి పెరుగుతాయని స్పష్టం చేశారు. అదేవిధంగా, ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో కూడా సీట్లు గణనీయంగా పెరగనున్నాయని తెలిపారు. కర్ణాటకలో 28 నుంచి 42కు, తమిళనాడులో 39 నుంచి 59కు, మరియు కేరళలో 20 నుంచి 30 సీట్లకు పెరిగే అవకాశం ఉందని ఆయన

మిగతా 2వ పేజిలో..

# ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించడమే

## బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య మండిపడ్డ కేటీఆర్

**హైదరాబాద్ జనసంఘర్షణ**

పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఎవరి దయాదాక్షిణ్యాలతోనో, భిక్షతోనో రాలేదని, దశాబ్దాల సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా సిద్ధించిందని

మిగతా 2వ పేజిలో..



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
17 శుక్రవారం, ఏప్రిల్ 2026

# సభ ముందుకు బిల్లులు

**మొదటిపేజీ తరువాయి..** ప్రస్తుతమున్న 550 నుండి గరిష్ఠంగా 850కి పెంచడం మరియు 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టడం. డీలిమిటేషన్ కమిషన్ బిల్లు: లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయడం. కేంద్రపాలిత ప్రాంతాల బిల్లు: కేంద్రపాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించడం. ఈ మూడింటిలో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో మూడింట రెండొంతుల (2/3 వంతు) మెజారిటీ అవసరం. అంటే, ప్రస్తుత సభ్యుల సంఖ్యను బట్టి 360 మంది సభ్యుల మద్దతు కావాలి. ఎన్డీయే కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉండగా, మరో 68 మంది సభ్యుల మద్దతు అవసరం. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్న 'ఇండియా' కూటమి ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తామని స్పష్టం చేయడంతో, ఈ చారిత్రక బిల్లు ఆమోదం పొందుతుందా లేదా అన్నది రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. ఈ బిల్లులపై చర్చ అనంతరం సాయంత్రం ప్రధాని మోదీ సభలో ప్రసంగించనున్నారు.

# అమిత్ షా కౌంటర్

**మొదటిపేజీ తరువాయి..** చేశారు. దేశంలో జనగణన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, ప్రస్తుతం గృహ గణన జరుగుతోందని ఆయన వివరించారు. "ఇళ్లకు కులాలు ఉండవు, కుదిరితే సమాజ్‌వాదీ పార్టీ ఇళ్లకు కూడా కులాన్ని ఆపాదిస్తుంది" అని అమిత్ షా ఎద్దేవా చేశారు. వ్యక్తుల గణన సమయంలోనే కుల ప్రస్తావన వస్తుందని, కులగణనతో కూడిన జనగణన జరుగుతుందని సభకు హామీ ఇచ్చారు. ప్రజల్లో అనవసర ఆందోళనలు రేకెత్తించేలా విపక్షాలు మాట్లాడటం తగదని ఆయన హితవు పలికారు.
మొత్తంగా, మహిళా రిజర్వేషన్లు మరియు నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై పార్లమెంటులో వాడీవేడి చర్చ కొనసాగుతోంది.

## రాజకీయ కోణంలో చూడొద్దు : మోడీ

**మొదటిపేజీ తరువాయి..** జరగదని ఆయన హామీ ఇచ్చారు. ప్రస్తుతం 33 శాతం రిజర్వేషన్ల అమలుపై దృష్టి పెడదామని, ఓబీసీ మరియు ఇతర వర్గాల కోటాపై భవిష్యత్తులో చర్చించవచ్చని ఆయన సూచించారు. మహిళా రిజర్వేషన్ ప్రక్రియను మరింత ఆలస్యం చేయడం మహిళలకే ద్రోహం చేయడమని, రాజకీయ ప్రయోజనాల కోసం ఈ బిల్లును అడ్డుకునే వారికి భవిష్యత్తులో మహిళలే తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. దేశం కాలానుగుణంగా మారాల్సిన అవసరం ఉందని, మహిళలకు అవకాశం కల్పిస్తే వారు దేశానికి సరికొత్త మార్గాన్ని చూపిస్తారని ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్లను 2029లోపు అమలు చేయకపోతే వారికి అన్యాయం చేసినట్లవుతుందని పేర్కొన్న మోదీ, రాజకీయాల్లో మహిళల సత్తాను చాటేందుకు ఇది ఒక సువర్ణావకాశమని అభివర్ణించారు. ఏ పార్టీ పట్ల వివక్ష చూపకుండా, దేశ హితం కోరే ప్రతి పార్టీ కూడా ఈ చారిత్రక బిల్లుకు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ముగింపులో, తన స్వార్థం కోసం లేదా రాజకీయ లబ్ధి కోసం ఈ బిల్లును ప్రవేశపెట్టలేదని, దేశంలో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని ప్రధాని తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

# ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించడమే

**మొదటిపేజీ తరువాయి..** కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుండి తేజస్వీ సూర్య వరకు బీజేపీ నేతలందరికీ తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని, వారు పదేపదే ఇలాంటి తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తూ తమ కుసంస్కారాన్ని బయటపెట్టుకుంటున్నారని ఆయన విమర్శించారు. ఈ ఘటనపై కేటీఆర్ అధికార, ప్రతిపక్ష ఎంపీలను కూడా తప్పుబట్టారు. తెలంగాణను పార్లమెంటులోనే అవమానిస్తుంటే, అక్కడ ఉన్న బీజేపీకి చెందిన ఎనిమిది మంది ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు. అంతేకాకుండా, రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీలు కూడా ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడం దారుణమని, వారు రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు ఆయన బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒకవేళ బీజేపీ అధిష్టానం ఈ వ్యాఖ్యలను ఖండించకపోతే, తేజస్వీ సూర్య మాటలే ఆ పార్టీ అధికారిక విధానంగా పరిగణించాల్సి ఉంటుందని కేటీఆర్ తీవ్రంగా హెచ్చరించారు.

## ఎసిబికి చిక్కిన విద్యుత్ ఎడిఇ

**30వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**

**నల్గొండ, ఏప్రిల్16 :**
రాష్ట్రంలో ప్రతిరోజు అవినీతి అధికారులు ఏసీబీకి పట్టుబడుతున్నారు. తాజాగా నల్గొండ జిల్లా దేవరకొండ ఏడీఈ సిరికొండ సైదులు గురువారం బాధితుడు నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కాడు. గత సంవత్సరం కంబాలపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌పై పిడుగుపడి మరమ్మతులకు గురైంది. మరమ్మతులకు అయిన రూ.10 లక్షల బిల్లుల కోసం అధికారిని సంప్రదించగా లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు నల్గొండ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని, కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.

# తెలుగు రాష్ట్రాల్లో సీట్లు పెరుగుతాయి

**మొదటిపేజీ తరువాయి..** పేర్కొన్నారు. అదే సమయంలో, దేశంలో జనాభా గణన ప్రక్రియ ఇప్పటికే మొదలైందని, దీనితో పాటు కుల గణనను కూడా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన సభకు హామీ ఇచ్చారు. ప్రస్తుతం గృహ గణన పనులు జరుగుతున్నాయని, తదుపరి ప్రక్రియలో కుల గణనను కూడా చేర్చుతామని వివరించారు. ఇక మతపరమైన రిజర్వేషన్లపై అమిత్ షా స్పష్టమైన వైఖరిని వ్యక్తం చేశారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని, అలాంటి ఆలోచనకు తావులేదని తేల్చి చెప్పారు. అఖిలేష్ యాదవ్ చేసిన డిమాండ్లను ఉద్దేశించి మాట్లాడుతూ, "ముస్లిం మహిళలకు రిజర్వేషన్లు కావాలంటే, అఖిలేష్ యాదవ్ తన పార్టీ తరపున వారికి ఎక్కువ టికెట్లు ఇవ్వవచ్చు, దానిపై మాకు ఎలాంటి అభ్యంతరం లేదు" అని వ్యాఖ్యానించారు. మొత్తంగా, డీలిమిటేషన్ ద్వారా ఏ రాష్ట్రానికి అన్యాయం జరగదని, అభివృద్ధి లక్ష్యంగానే ఈ నిర్ణయాలు తీసుకున్నామని అమిత్ షా స్పష్టం చేశారు.

# ఎండల మంట..

**మొదటిపేజీ తరువాయి..** మారుతుండగా, ప్రజలు ఇంటికే పరిమితమవుతున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక్కడ గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. రాబోయే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా ప్రాంతాల్లో కూడా వడగాలుల ప్రభావం ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఏప్రిల్ 19 నుంచి మే 31 వరకు ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ఉష్ణోగ్రతలు 40-45 డిగ్రీల వరకు చేరుకుంటున్న నేపథ్యంలో ఆరోగ్య నిపుణులు పలు జాగ్రత్తలు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎవరూ బయటకు రావద్దని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఎండ తీవ్రత వల్ల డీహైడ్రేషన్, తలనొప్పి, వడదెబ్బ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే వడగాలుల వల్ల పలు మరణాలు సంభవించినట్లు వార్తలు వస్తుండటంతో, మనుషులతో పాటు పశుపక్షాదులను కూడా వేడి నుంచి కాపాడుకోవాలని సూచిస్తున్నారు.

**ఎల్నినో ప్రభావం.. వర్షాలపై ఆందోళన**

ఈ ఏడాది ఎల్నినో ప్రభావం వల్ల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగడమే కాకుండా, రాబోయే రుతుపవనాల సమయంలో వర్షపాతం కూడా తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీనివల్ల రాష్ట్రంలో నీటి వనరులకు కొరత ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ, కర్నూలు, రామగుండం, భద్రాచలం వంటి ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45-47 డిగ్రీల వరకు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# పార్టీ మారిన వారందరూ వివరణ ఇవ్వాలి

**మొదటిపేజీ తరువాయి..** సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం విచారణ చేపట్టిన హైకోర్టు, ఈ విషయంలో స్పీకర్‌తో సహా సంబంధిత ఎమ్మెల్యేలందరూ వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అరెకపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి (సంజయ్), తెల్లం వెంకట్రావు వంటి నేతలు తాము పార్టీ మారలేదని సాంకేతికంగా స్పీకర్ వద్ద వాదించగా, వారు బహిరంగంగానే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోర్టును ఆశ్రయించారు.
ఈ నేపథ్యంలో, స్పీకర్ నిర్ణయం ఏకపక్షంగా ఉందన్న పిటిషనర్ల వాదనను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, ప్రతివాదులందరూ తమ వాదనలతో కూడిన కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ కేసులో లోతైన విచారణ అవసరమని భావించిన న్యాయస్థానం, తదుపరి విచారణను మే 6వ తేదీకి వాయిదా వేసింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై స్పీకర్ పాత్రను మరియు రాజ్యాంగ పరమైన అంశాలను హైకోర్టు ఎలా పరిశీలిస్తుందన్నది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ఆసక్తిగా మారింది. ఒకవేళ కోర్టు అనర్హత వేటు విషయంలో కఠినంగా వ్యవహరిస్తే, సదరు నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

## సెల్ఫ్ ఎమ్యూనరేషన్‌లో పాల్గొన్న స్పీకర్

**స్వగృహంలో ప్రక్రి పూర్తి చేసిన అయ్యన్నపాత్రుడు**

**అనకాపల్లి, ఏప్రిల్16 :** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగణన-2027 పక్రియలో భాగంగా ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని తన నివాసంలో సెల్ఫ్ ఎన్యూమరేషన్ పక్రియ పూర్తి చేశారు. దేశవ్యాప్తంగా గురువారం నుంచి ప్రారంభమైన ఇళ్ల జాబితా, ఇళ్ల గణన తొలి విడత కార్యక్రమంలో భాగంగా ఆయన అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఈ పక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ గణనలో పాల్గొని దేశాభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు.

## వడదెబ్బతో కొడుకు మృతి

**తట్టులోలేక తల్లి మరణం**

**జోగులాంబ గద్వాల, ఏప్రిల్16 :**
జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అప్పటివరకు కళ్ళముందే తిరిగిన కొడుకు అనంతలోకాలకు వెళ్లగా.. ఆ వార్త విన్న తల్లి గుండె తట్టుకోలేకపోయింది. కొడుకు మరణించిన గంటల వ్యవధిలోనే తల్లి కూడా కన్నుమూసింది. ఈ ఘటన అయిజ మండలం తూముకుంట గ్రామాన్ని శోకసంద్రంలో ముంచేసింది. గ్రామానికి చెందిన కుర్వ మల్లికార్జున్ తీవ్రమైన వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయాడు. కంటిపాపలా పెంచుకున్న కొడుకు ఇక లేడన్న వార్త విన్న తల్లి కురువ రంగమ్మ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు మరణవార్తను ఆమె తట్టుకోలేక పోయింది. పుట్టెడు దుఃఖంతో ఆమె గుండె ఆగిపోయింది. ఒకే ఇంట్లో తల్లీకొడుకులు మృతి చెందడంతో తూముకుంట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేస్తోంది.

## మహిళా రిజర్వేషన్లు మహిళల హక్కు

**ఎంతోకాలంగా ఈ బిల్లు పెండింగ్‌లో ఉంది**

**గతంలో సమాజ్‌వాది పార్టీ అడ్డుకుంది**

**మహిళలకు ఆస్తిలో సమానవాటా ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌ది**

**బిల్లును అనవసర కారణాలతో అడ్డుకోరాదు**

**రాజమండ్రి ఎంపి పురందేశ్వరి**

**న్యూఢిల్లీ, ఏప్రిల్16 :**
మహిళా రిజర్వేషన్ డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని రాజమండ్రి లోక్‌సభ ఎంపీ పురందేశ్వరి అన్నారు. గతంలో చాలాసార్లు బిల్లు పెట్టినా సాకారం కాలేదని, అప్పట్లో సమాజ్‌వాదీ పార్టీ మద్దతివ్వలేదని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా లోక్‌సభలో ఆమె మాట్లాడారు. రాజకీయాల్లో మహిళల పాత్ర పెరిగిందని గ్రహించాలన్నారు. ఈ బిల్లు పాస్ కావడం మహిళల దశాబ్దాల కల. 2023లో మద్దతిచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు మాత్రం కొర్రీలు పెడుతోంది. జనగణన పేరుతో అభ్యంతరాలు చెబుతోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు మొట్టమొదట 1996లో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ మాత్రం ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టిందని అన్నారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పునర్విభజన 131వ రాజ్యాంగ సవరణ బిల్లులపై జరిగిన చర్చలో పలు విషయాలు వెల్లడించారు. ఈ చారిత్రక బిల్లులకు పూర్తి మద్దతు ప్రకటించిన ఆమె, మహిళా రిజర్వేషన్ల అమలులో గత ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు. ప్రసంగం ప్రారంభంలో ఆమె తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మహిళా సాధికారత కోసం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే ఆస్తిలో కుమార్తెలకు సమాన హక్కులు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు, మహిళా విశ్వవిద్యాలయం, మహిళా పోలీస్ స్టేషన్ల ఏర్పాటు వంటి విప్లవాత్మక నిర్ణయాలను ఆయన తీసుకున్నారని సభకు వివరించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ సీట్లను కోల్పోతాయన్న ఆందోళనలపై ఆమె స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రణాళిక ప్రకారం, లోక్‌సభ స్థానాల సంఖ్యను 50 శాతం పెంచడం వల్ల ఏ రాష్ట్రానికి ఉన్న ప్రస్తుత సీట్లు తగ్గవని భరోసా ఇచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సీట్ల పెంపు ఉండటం వల్ల రాజకీయ సమతుల్యత దెబ్బతినదని, దక్షిణాది రాష్ట్రాల గొంతు పార్లమెంట్‌లో బలంగానే ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం గతంలో తీవ్ర జాప్యం చేసిందని పురందేశ్వరి విమర్శించారు. 1996 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ బిల్లును 2010లో రాజ్యసభ ఆమోదించినా, లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి కాంగ్రెస్‌కు మనసు రాలేదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు ప్రధాని మోదీ ఈ బిల్లును యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తుంటే, విపక్షాలు అనవసరపు రాజకీయ కారణాలతో అడ్డుకోవాలని చూడటం సరికాదన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలు వల్ల దేశాభివృద్ధిలో మహిళలు కేవలం భాగస్వాములుగా మాత్రమే కాకుండా, నిర్ణేతలుగా మారతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఈ బిల్లు మహిళలకు రాజకీయ న్యాయం చేకూరుస్తుందని పేర్కొన్నారు. పునర్విభజన పక్రియలో ప్రతి రాష్ట్రం గొంతు వినబడుతుందని, పబ్లిక్ హియరింగ్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలను తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ చారిత్రక ఘట్టంలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని చెబుతూ ఆమె తన ప్రసంగాన్ని ముగించారు.

## గుప్పుమంటున్న గుడంబా - సింగరేణి మండలంలో మళ్లీ విస్తరిస్తున్న అక్రమ సారాయి

- **కుటుంబాలు కూలిపోతున్నా అధికారుల మౌనం - గ్రామీణ సమాజంపై ముప్పు**

సింగరేణి ప్రతినిధి :(జన సంఘర్షణ )

సింగరేణి మండలం పరిధిలో గుడంబ సమస్య మళ్లీ పుంజుకుని గ్రామీణ సమాజాన్ని కుదిపేస్తోంది. ఒకప్పుడు కఠిన చర్యలతో అణచివేసిన ఈ అక్రమ సారాయి వ్యాపారం మళ్లీ బలంగా వెలుగుచూస్తుండటం అధికార యంత్రాంగ వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. గుంపెళ్లగూడెం, మాదారం, పేరెపల్లి, భాగ్యనగర్, ఉసిరికాయలపల్లి గ్రామ పంచాయతీల్లో గుడంబ తయారీ, రవాణా, విక్రయాలు ఎటువంటి భయం లేకుండా బహిరంగంగానే సాగుతున్నాయి. తండాల్లో చిన్న గుడిసెల్లో తయారు చేస్తున్న గుడంబ ఇప్పుడు గ్రామాల మధ్య స్వేచ్ఛగా సరఫరా అవుతూ మరింత ప్రమాదకరంగా మారింది. గతంలో గుడంబ కారణంగా ఎన్నో కుటుంబాలు నాశనమయ్యాయి. ఆరోగ్య సమస్యలు, అకాల మరణాలు, కుటుంబ కలహాలు, మహిళలపై హింస, పిల్లల భవిష్యత్తు చీకటిలో మగ్గడం వంటి చేదు అనుభవాల తర్వాత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని ఈ దందాను అణచివేసింది. అయితే ఇప్పుడు అదే పరిస్థితులు మళ్లీ పునరావృతమవుతుండటం ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కేవలం 50 రూపాయలకే గుడంబ లభిస్తుండటంతో పేద, కూలీ వర్గాలు దీనికి బానిసలవుతున్నారు. రోజు సంపాదన మొత్తాన్ని ఈ విషపూరిత మద్యం మీద ఖర్చు చేస్తూ కుటుంబాలను అప్పుల బారిన పడేస్తున్నారు. మద్యం మత్తులో కుటుంబాలపై దాడులు, గొడవలు పెరిగి గ్రామాల్లో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి. ఈ పరిస్థితులన్నింటికీ ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ తయారీ కేంద్రాలు ఎక్కడున్నాయో గ్రామస్థాయిలో అందరికీ తెలిసినా వాటిపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. అప్పుడప్పుడు నిర్వహించే దాడులు తప్ప దీర్ఘకాలిక పరిష్కారం కనిపించడం లేదు. కొందరు అధికారులు లంచాల మత్తులో ఈ దందాను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యం, కుటుంబాల భవిష్యత్తు కంటే అక్రమ సంపాదన ముఖ్యమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక దళాలతో గుడంబ నిర్మూలనకు కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



అక్రమ తయారీ కేంద్రాలపై నిరంతర దాడులు నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదే సమయంలో గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గుడంబ వల్ల కలిగే ప్రమాదాలను ప్రజలకు తెలియజేయాలని సూచిస్తున్నారు. మహిళా సంఘాలు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేస్తూ ఈ వ్యతిరేక ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని చర్యలు తీసుకోకపోతే గుడంబ మళ్లీ గ్రామీణ సమాజాన్ని పూర్తిగా నాశనం చేసే ప్రమాదం ఉందని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కారేపల్లి కె.వి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అద్భుతంగా యాన్యువల్ డే వేడుకలు

- **నాణ్యమైన విద్యతో ముందుకు దూసుకెళ్తున్న పాఠశాల**
- **విద్యార్థులకు స్వర్ణావకాశం**

సింగరేణి ప్రతినిధి (జన సంఘర్షణ):

కె.వి ఇంగ్లీష్ మీడియం పాఠశాల రెండో సంవత్సరం విజయవంతంగా పూర్తి చేసుకొని మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన యాన్యువల్ డే వేడుకలు అత్యంత ఘనంగా, ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పాఠశాల ప్రాంగణం విద్యార్థుల ప్రతిభతో కళకళలాడింది. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, ప్రసంగాలు హాజరైన వారిని మంత్రముగ్ధులను చేశాయి. విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీసే విధంగా పాఠశాల అందిస్తున్న ప్రోత్సాహం ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం విద్య అందించడం తమ ముఖ్య లక్ష్యమని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలు కూడా మంచి విద్యను పొందేలా ఫీజుల విషయంలో ప్రత్యేక సౌలభ్యం కల్పిస్తున్నామని చెప్పారు. విద్యారంగంలో పోటీ ప్రపంచానికి సరిపోయే విధంగా బోధన పద్ధతులను అమలు చేస్తూ, జిల్లాలోనే గుర్తింపు పొందిన పాఠశాలగా ఎదిగామని గర్వంగా తెలిపారు. పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఆధునిక బోధన విధానాలు, క్రమశిక్షణతో కూడిన వాతావరణం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందని వివరించారు. అదేవిధంగా చుట్టుపక్కల గ్రామాల విద్యార్థుల కోసం సురక్షితమైన వ్యాన్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.



దీంతో గ్రామీణ ప్రాంతాల పిల్లలు కూడా సులభంగా పాఠశాలకు చేరుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. మొత్తంగా, విద్యతో పాటు విలువల బోధన, ప్రతిభాభివృద్ధి, క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తున్న కె.వి ఇంగ్లీష్ మీడియం పాఠశాల, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉత్తమ విద్యాసంస్థగా నిలుస్తోంది. తమ పిల్లలకు మంచి భవిష్యత్తు కావాలనుకునే తల్లిదండ్రులకు ఈ పాఠశాల ఒక ఉత్తమ ఎంపికగా మారుతోంది.

## పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు

- **తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (పి ఓ ఎస్ ఎస్)పదో తరగతి పరీక్షా, ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్ ఏప్రిల్ -2026 పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు : పోలీస్ కమీషనర్ వెల్లడి**

నిజామాబాద్ సిటీ . ఏప్రిల్ 16. (జన సంఘర్షణ )

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో గల అన్ని పోలీస్ స్టేషన్ సమీపంలో ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 27 వరకు నిర్వహించబడనున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టిఓఎస్ఎస్) పదో తరగతి (ఎస్ఎస్ ), ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరఫున కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు. పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు, మధ్యాహ్నం 02:30 నుండి



సాయంత్రం 5:30 వరకు జిల్లాలోని మొత్తం 27 పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ పాత సెక్షన్ 144 సి.ఆర్.పి.సి ) అమలులో ఉంటుందని వెల్లడించారు. ఈ ఉత్తర్వుల ప్రకారం పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఇద్దరికి మించి గుంపులుగా చేరడం నిషేధం. పరీక్షల సమయంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు అన్ని పరీక్ష కేంద్రాలలో తేది:-20-04-2026, నుండి 27-04-2026 వరకు (ఉదయం 07:30 నుండి సాయంత్రం 06:00 వరకు) సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు , జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలను తప్పనిసరిగా మూసివేయాలని సంబంధిత యజమానులకు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బందోబస్త్ ఏర్పాటు చేయబడుతుందని, కేంద్రాల వద్ద అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతామని పోలీస్ కమిషనర్ తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, నిషేధిత వస్తువులు తీసుకురావడానికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షలు రాసే విద్యార్థులందరూ ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజయవంతంగా ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షిస్తూ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, విద్యార్థులకు " ఆల్ ది బెస్ట్ " తెలిపారు.

## పోతంగల్ గ్రామసభ నిర్వహణ విజయవంతం

పోతంగల్/ఏప్రిల్16/(జన సంరక్షణ)




నిజామాబాద్ జిల్లా, పోతంగల్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ గ్రామ సభ నిర్వహించారు. మొదటి సమస్యతో ఏర్పాటు చేయడం జరిగింది. పోతంగల్ బస్టాండ్ ఆవరణంలో ఉన్న ఆటో స్టాండ్‌ని వేరే ప్రాంతంలోకి మార్చాలని కోరారు. ఎందుకంటే బస్టాండ్లో ప్రయాణికులకు ఇబ్బంది అవుతుంది కాబట్టి అదే విధంగా గ్రామంలో ఉన్న రహదారులపై భారీ వాహనాలు ఇసుక వాహనాలు వెళ్లడం వలన ప్రయాణికులకు, దుకాణాలకు ఇబ్బంది అవుతుంది. రోజుకు రెండుసార్లు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రోడ్లపై నీళ్లను చెల్లించాలని స్థానిక గ్రామ సర్పంచ్‌ని సెక్రటరీ గ్రామ ప్రజలు కోరారు. గ్రామంలో కొన్ని ప్రాంతాలలో నీటి సమస్య కూడా గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్, ఉప సర్పంచ్ నబి, గ్రామపంచాయతీ సెక్రటరీ యాదవ్, వార్డ్ నెంబర్లు పంచ రెడ్డి అనిల్, మర్కెల్ సంతోష్, గంధపు సంధ్య, కల్లూరి వసంత, గజ్జల భారతి, తోకల శేఖర్, గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు, పబ్బా శేఖర్ ,తదితరులు పాల్గొన్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామసభ ప్రశాంతంగా ముగిసింది.

## రాజ్యసభ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు

- **వేం నరేందర్ రెడ్డికి తెలంగాణ భవన్‌లో శుభాకాంక్షలు**

ఇల్లందు ప్రతినిధి:( జన సంఘర్షణ)



వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యత్వ ప్రమాణ స్వీకారోత్సవం ఢిల్లీలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం తెలంగాణ భవన్‌లో వేం నరేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుండి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, కొత్తపేట గంధంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ భుక్యా ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారం రైతు వేదికలో మండల స్థాయి సమావేశం

- **నీటి సమస్య పరిష్కారానికి కొత్త పైప్‌లైన్ ప్రతిపాదన**

ఇల్లందు ప్రతినిధి జన సంఘర్షణ



బయ్యారం మండలం కేంద్రంలోని రైతు వేదికలో ప్రజపాలన-- ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, మండల రెవెన్యూ అధికారి నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బయ్యారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో గ్రామ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. గతంలో ఉమ్మడి పంచాయతీగా ఉన్నప్పుడు బయ్యారం, జెగ్గుతండా ప్రాంతాలకు రెండు వాటర్ ట్యాంకులు ఉండేవని, ప్రస్తుతం మూడు ట్యాంకులు ఉన్నప్పటికీ ఒకే పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా జరుగుతుండటంతో ప్రతి రోజు సరిపడా నీరు అందించడం కష్టంగా మారిందన్నారు. అందువల్ల మూడు ట్యాంకులకు వేర్వేరు ప్రాంతాలకు సరిపడే విధంగా కొత్త పైప్‌లైన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల తరఫున సర్పంచ్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీవో, మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మాచారెడ్డి: ఆరోగ్య సేవలపై విశ్లేషణ

మాచరెడ్డి, ఏప్రిల్ 16. ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా సమావేశంలో ప్రజారోగ్య విషయాలపై విశ్లేషించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ ఆదర్శ్ తెలిపారు. వేసవికాలం తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై వివరించామన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలపై ముందుకు ఎలా వెళ్లాలో తెలిపినట్లు వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామాల్లో సబ్ సెంటర్లు వైద్య సేవలను నిర్విరామంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## పిల్లల ప్రతిభకు వేదిక.. 'వెంకట్ డాన్స్ అకాడమీ'

- **మెగా సమ్మర్ క్యాంప్!**

ఇల్లందు ఏప్రిల్ 16 (జన సంఘర్షణ)



నేటి యాంత్రిక జీవనశైలిలో చిన్నారులు కేవలం నాలుగు గోడల మధ్య డిజిటల్ స్క్రీన్లకే పరిమితమైపోతున్న తరుణంలో, వారిలోని కళాత్మక నైపుణ్యాలను వెలికితీసి ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు ఇల్లందు పట్టణంలో ఒక అద్భుత వేదిక సిద్ధమైంది. స్థానిక వెంకట్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో డాన్స్ మాస్టర్స్ కడారి వెంకటేష్, ఎలుకపల్లి సాయి నేతృత్వంలో ఈ నెల 20వ తేదీ (సోమవారం) నుండి స్థానిక ఎంఆర్‌జీ నారాయణ స్కూల్ ప్రాంగణంలో ప్రతిష్టాత్మకమైన 56 రోజుల మెగా సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు సాగే ఈ శిక్షణలో కేవలం నృత్య రీతులే కాకుండా, చిన్నారులలో స్టేజ్ ఫియర్‌ను పోగొట్టి, శారీరక దృఢత్వం మరియు క్రమశిక్షణను పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు ప్రణాళికలు రూపొందించారు. సెలవులను కేవలం వినోదానికే పరిమితం చేయకుండా, ఒక పరిపూర్ణమైన వ్యక్తిత్వ వికాస వేదికగా మార్చుకోవాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ క్యాంప్ ముగింపు సందర్భంగా, జూన్ 14న నిర్వహించబోయే మెగా డాన్స్ ప్రోగ్రామ్ చిన్నారుల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయనుంది. తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తును కాంక్షించే తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8374579497, 7989163958, 9030099139 నంబర్లను సంప్రదించాలని కోరుతూ అకాడమీ నిర్వాహకులు ఈ ప్రకటన విడుదల చేశారు.

## మెట్ల పై నుంచి పడి మార్కెట్ కమిటీ ఉద్యోగి మృతి

వర్ని/ఏప్రిల్16/(జన సంఘర్షణ)



వర్ని మండల కేంద్రంలో మార్కెట్ కమిటీలో స్వీపర్‌గా పనిచేస్తున్న ఖాదర్ వయసు(47) ప్రమాదవశాత్తు మెట్ల పైనుంచి పడి మృతి చెందినట్లు వర్ని ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తెలిపారు. ఈనెల 15 మార్కెట్ కమిటీ కార్యాలయంలో మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి పడటంతో తీవ్ర గాయాలు అయినట్టు వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
17 ఏప్రిల్ 2026

# కల కన్న మట్టి కోసం.. కదిలి వచ్చిన 'ఇల్లందు వైబ్స్'

- ఇల్లందు అస్తిత్వ పోరాటంలో సుజిత్ కుమార్ సెనిగరపు!
- గనిలో బొగ్గును.. ఊరిలో భవిష్యత్తును వెలికితీస్తున్న 'వైబ్స్'






ఇల్లందు ఏప్రిల్ 16 (జన సంఘర్షణ)
ఏ మట్టిలోనైతే పుట్టామో, ఏ గాలిని పీల్చి పెరిగామో.. ఆ ఊరి రుణం తీర్చుకోవాలనే తపన అందరికీ ఉండదు. కానీ, ఉన్నత చదువుల కోసం నగరం బాట పట్టినా, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడినా, తన గుండె చప్పుడు మాత్రం ఎప్పుడూ ఇల్లందు కోసమే కొట్టుకుంటుందని నిరూపిస్తున్నారు సుజిత్ కుమార్ సెనిగరపు. రాజ్‌కుమార్ కుమారుడైన సుజిత్, కేవలం ఒక ఇన్స్టాగ్రామ్ పేజీ అడ్మిన్ మాత్రమే కాదు, ఇల్లందు గతాన్ని గౌరవిస్తూ, వర్తమానాన్ని ప్రశ్నిస్తూ, భవిష్యత్తు కోసం పోరాడుతున్న ఒక అలుపెరుగని వ్యక్తి.

**బ్రిటిష్ కాలపు వైభవం నుండి నేటి వెనుకబాటు వరకు..**


ఒకప్పుడు బ్రిటిష్ దొరలు సైతం 'మాంచెస్టర్ ఆఫ్ ఇండియా'గా మార్చాలని కలలు కన్న ప్రాంతం మన ఇల్లందు. 30కి పైగా బొగ్గు గనులు, సింగరేణి హెడ్ ఆఫీస్, ప్రతిష్టాత్మక రైల్వే స్టేషన్, పవర్ ప్లాంట్.. ఇలా ఎంతో వైభవం కలిగిన చరిత్ర మనది. కానీ, కాలక్రమేణా ఇక్కడి బొగ్గును వాడుకుని, పట్టణాన్ని విస్మరించడంపై సుజిత్ తన వీడియోల ద్వారా ప్రజల్లో ఆలోచన రేకెత్తిస్తున్నారు. సీతారామ ప్రాజెక్టు, ఫారెస్ట్ హెడ్ ఆఫీస్, పేపర్ ఫ్యాక్టరీ వంటివి ఇక్కడికి వచ్చిన తరువాత వేరే ప్రాంతాలకు తరలిపోవడంపై ఆయన గళం ఎత్తుతూ, ఇల్లందు కోల్పోతున్న ప్రాధాన్యతను నిరంతరం గుర్తు చేస్తున్నారు.

**సాంకేతికతతో సామాజిక చైతన్యం:**

2019లో 'బొగ్గుట న్యూస్' యూట్యూబ్ ఛానెల్ ద్వారా మొదలైన ఆయన ప్రస్థానం, లాక్డౌన్ సమయంలో 'ఇల్లందు వైబ్స్' ఇన్స్టాగ్రామ్ పేజీగా రూపాంతరం చెందింది. ఇల్లందులో దొరికే నోరూరించే వంటకాలు, ఇక్కడి విలక్షణమైన సంస్కృతి, అందమైన జ్ఞాపకాలను సోషల్ మీడియా వేదికగా ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. కేవలం వినోదానికే పరిమితం కాకుండా, పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీ సమస్యలు, ఇతర అభివృద్ధి పనులపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా ఇల్లందులో డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ కళాశాలల ఏర్పాటు కోసం, అలాగే రైల్వే స్టేషన్ పునరుద్ధరణ కోసం ఆయన చేస్తున్న పోరాటం అభినందనీయం.

**మానవీయ కోణం - సామాజిక బాధ్యత:**

పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ సుజిత్ నేతృత్వంలో నిర్వహించిన 'క్యాండిల్ లైట్ ర్యాలీ' యువతలో దేశభక్తిని, సామాజిక స్పృహను నింపింది.




జిల్లా కలెక్టర్‌తో భద్రాద్రి, ఇల్లందు టూరిజం అభివృద్ధిపై చర్చించడం, 'ఏరు రివర్ ఫెస్టివల్'లో భాగస్వామ్యం కావడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. అలాగే 'ఫ్యూజన్' పేరుతో సరికొత్త ట్రెండ్‌లో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ నిర్వహించి ఇల్లందు వాసులకు కొత్త ఉత్సాహాన్ని అందించారు.

**రోడ్డు భద్రతపై జిల్లా ఎస్పీతో 'ఇల్లందు వైబ్స్' అడ్మిన్ భేటీ**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా, జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ రోహిత్ రాజ్ జిల్లాలోని సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా జరిగిన ఈ భేటీలో 'ఇల్లందు వైబ్స్' అడ్మిన్ సుజిత్ కుమార్ పాల్గొని, ఇల్లందు పట్టణంలోని కీలక సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఫుట్పాత్ల ఆక్రమణ, పశువుల సంచారంపై పోరాటం ఈ సమావేశంలో సుజిత్ కుమార్ మాట్లాడుతూ.. ఇల్లందు పట్టణంలో ప్రధానంగా ఫుట్పాత్లు ఆక్రమణకు గురవ్వడం వల్ల పాదచారులు రోడ్డుపై నడవాల్సి వస్తోందని, దీనివల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. అలాగే రోడ్లపై పశు వుల సంచారం వాహనదారులకు ప్రాణసంకటంగా మారిందని, వీటి వల్ల జరుగుతున్న ప్రమాదాలను గణాంకాలతో సహా ఎస్పీకి వివరించారు.

**సుజిత్ కుమార్ చొరవపై ఎస్పీ ప్రశంసలు**

కేవలం సమస్యలను చెప్పడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను సుజిత్ కుమార్ వివరించిన తీరుపై ఎస్పీ రోహిత్ రాజ్ సానుకూలంగా స్పందించారు. ప్రజల భద్రత కోసం సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు ఇలాంటి సామాజిక అంశాలపై బాధ్యతగా స్పందించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. "సింగరేణికి వెలుగునిచ్చిన నేల.. చీకటిలో ఉండకూడదు" అనే లక్ష్యంతో సాగుతున్న సుజిత్ కుమార్ ప్రయత్నం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది. ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా తన పని తాను చేసుకుపోకుండా, తన ఊరి బాగు కోసం నిరంతరం తపిస్తున్న సుజిత్ కుమార్ సెనిగరపు వంటి యువత ఇల్లందు లాంటి పట్టణాలకు ఎంతో అవసరం. 'ఇల్లందు వైబ్స్' కేవలం ఒక పేజీ కాదు.. అది ఇల్లందు ఆత్మగౌరవ ప్రతీక.

# ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం: పోలీస్ కమీషనర్ వెల్లడి


- 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆటో / అంబులెన్సు డ్రైవర్స్‌కు అవగాహన కార్యక్రమం

నిజామాబాద్ సిటీ . ఏప్రిల్ 16 . (జన సంఘర్షణ )
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా "అరైవ్ అలైవ్ " కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నేడు 4వ రోజు నిజామాబాదు నగరంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఆటో డ్రైవర్లు, అంబులెన్స్ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు ప్రతి ఒక్కరి ద్వారా రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం "అరైవ్ అలైవ్ " కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం , డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం , ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వంటి అంశాలేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనం నడిపి, తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనలు కుటుంబాలకు తీరని నష్టాన్ని కలిగిస్తాయని తెలియజేసారు. కోవిడ్ సమయంలో జిల్లా వ్యాప్తంగా దాదాపు 200 మంది మృతిచెందగా 2025లో జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల వలన 302 మంది తమ ప్రాణాలను కోల్పోయారని తెలియజేశారు. కావున రోడ్డు ప్రమాదాలు గణనీయంగా పెరిగి మరణాలు జరుగుతున్న కారణంగా ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కృషి చేయాలని ఇట్టి కృషి అనేది ప్రతి ఒక్క డ్రైవర్ నుండి మొదలవ్వాలని తెలియజేశారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్ లో అట్టి ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని హాస్పిటల్ తరలిస్తారో , అతనికి ప్రభుత్వం నుంచి ప్రోత్సహించుట కోసం సహార్వీర్ పథకం కింద ఉండేటటువంటి 25 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.




అనంతరం ట్రాఫిక్ నిబంధనలు తెలియజేసేటటువంటి పాంప్లెంట్లు మరియు పోస్టర్లను విడుదల చేసారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి జే. ఉమామహేశ్వరరావు, నిజామాబాద్ ఇన్చార్జి ఏసిపి రాజా వెంకటరెడ్డి, ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, ట్రాఫిక్ సిఐ ప్రసాద్, ట్రాఫిక్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ వినోద్, టౌన్ వన్ ఎస్‌హెచ్‌ఓ రఘువీర్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ వి.వి సుబ్బారావు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, జి.ఆర్.పిఎస్‌హెచ్ ఓ లింబాద్రి, టౌన్ వన్ ఎస్సై సుమలత, 34వ డివిజన్ కార్పొరేటర్ బంటు ప్రీతి ప్రవీణ్ కుమార్, ఆటో డ్రైవర్లు అంబులెన్స్ డ్రైవర్లు తదితరులు పాల్గొనడం జరిగింది.


## పోతంగల్ సబ్ స్టేషన్ పరిధిలో కొత్త ఆర్డబ్ల్యూఎస్ ప్రారంభం



పోతంగల్ మండల/ఏప్రిల్16/(జన సంఘర్షణ)
నిజామాబాద్ జిల్లా , పోతంగల్ మండల కేంద్రంలోని, సబ్ స్టేషన్‌లో కొత్త ఆర్డబ్ల్యూఎస్ ఫీడర్ను విద్యుత్ అంతరాయాలు నివారించడానికి నూతనంగా విసిబి ఏర్పాటు చేయడం జరిగింది. ఆర్డబ్ల్యుసిను బోధన్ డి ఈ ఎండి ముక్తార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రుద్రూర్ సబ్ డివిజన్ ఏడిఈ నవీన్ రెడ్డి , పొతంగల్ సబ్ స్టేషన్ ఏయ్ రాజేష్ , సబ్ ఇంజనీర్ ఫక్రుద్దీన్, ఎల్ ఐ గంగాధర్ విద్యుత్ సిబ్బంది బృందం పాల్గొని నూతన విసిబిని ప్రారంభించారు. డిఈ ఎండి ముక్తార్ మాట్లాడుతూ.. పొతంగల్ సబ్టేషన్ పరిధిలో ఉన్న చుట్టుపక్క గ్రామాలకు విద్యుత్ అంతరాయాలు కలగకుండా కొత్త ఆర్డబ్ల్యూఎస్‌ను సుమారు 6లక్షల ఖర్చుతో ప్రారంభించామని తెలిపారు.

## ఈ అమ్మ పేరు అనుమోలు జయమ్మతల్లి

- ఎన్నారై శశాంక్ ఆర్థిక సాయం



బోధన్ పెంటఖుర్ద్ గ్రామం/ఏప్రిల్16/(జన సంఘర్షణ)
బాన్సువాడ ఇంచార్జ్ ఎన్నారై శశాంక్ ఆర్థిక సాయం అందించిన ఈ తల్లి భర్త, ముగ్గురు కుమారులు చనిపోయారు. తన నివాసము, నిజామాబాద్ జిల్లా, బోధన్ మండలం, పెంటఖుర్ద్ గ్రామం. ఆమెకు గత ప్రభుత్వం కానీ ఇప్పటి ప్రభుత్వం డబల్ బెడ్రూమ్ ఇవ్వలేదు. ఇప్పటి ఇందిరమ్మ ఇల్లు కూడా రాలేదు . కనీసం గ్రామ పంచాయతీ వారు కూడా ఆ ఇంటికి రోడ్డు వెయ్యడం మరిచారు. కనీసం తినడానికి కూడా ఆర్థిక పరిస్థితి బాలేక ఇబ్బంది పడుతున్న విషయం బాన్సువాడ నియోజకవర్గం బిజెపి నాయకులు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ దృష్టికి రాగానే కోనేరు శశాంక్ వెంటనే స్పందించి తన వంతు ఆర్థిక సహాయంగా, వారికీ రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను అందించి వారికి అండగా ఉంటానని భరోసా ఇవ్వడం జరిగింది.

# ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

పాత వర్ని/ఏప్రిల్16/(జన సంఘర్షణ)
వర్ని మండల కేంద్రంలో పాతవారిని గ్రామానికి చెందిన సవరణ వయసు( 23)బుధవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తెలిపారు. గత కొంతకాలంగా వారి కుటుంబం సత్యనారాయణపురంలో నివసిస్తుందని చెప్పారు. కుటుంబ కారణాలతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు పేర్కొన్నారు. మృతురాలి తండ్రి గంగారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేసినట్టు వివరించారు.

# చిన్న రైతులపై పూర్తిగా వివక్ష చూపుతున్నారు

- ధాన్యం 20 రోజుల నుంచి అలాగే ఉంది




పోతంగల్ హంగర్గా ఫారం/ఏప్రిల్16/(జన సంఘర్షణ)
నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండలం హంగర్గా ఫారం గ్రామంలో రైతులకు చాలా వివక్ష చూపుతున్నారని రైతులు వాపోతున్నారు. చిన్న రైతులు అంటే మరీ చిన్నచూపు చూస్తున్నారని 20 రోజుల నుంచి ధాన్యం ఎండబోస్తున్నామని చిన్న రైతులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదని బార్ధాన్ సౌకర్యం కల్పించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చిన్న రైతులు వాపోతున్నారు. సంబంధించిన అధికారులు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

# కలుషిత నీటి సరఫరాపై ప్రజల ఫిర్యాదు...

- వెంటనే సమస్యను పరిష్కరించకుంటే జలమండలి కార్యాలయం ముట్టడిస్థాం....
- బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ .





హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 16( జనసంఘర్షణ )
ప్రతిరోజూ మంచినీటికి బదులు కలుషిత నీటి సరఫరా కావడంతో, అనారోగ్యాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ కు అరుంధతి నగర్ బస్తీ వాసులు ఫిర్యాదు చేశారు. మాజీ కార్పొరేటర్ సూచనల మేరకు బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, జలమండలి డిజిఎం వెంకట్ రెడ్డి, మేనేజర్ శివకుమార్ వారి సిబ్బందితో కలిసి బస్తీలో పర్యటించి, కలుషిత నీటినీ పరిశీలించారు. మంచినీటిలో మురికి నీరు కలవడంతో, వాటిని ఉపయోగించే ప్రజాలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని. అరుంధతి నగర్‌తో పాటు డివిజన్‌లోని అనేక ప్రాంతాల్లో ఇదే సమస్య తీవ్రతరంగా మారిందని, వెంటనే తక్షణ చర్యల్లో భాగంగా జలమండలి అధికారులు సమస్యను పరిష్కరించాలని, లేదంటే డివిజన్ ప్రజలతో కలిసి జమండలి కార్యాలయాన్ని ముట్టడించి, పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వినయ్ కుమార్ అధికారులను హెచ్చరించారు.. కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్,బస్తీ వాసులు నరసమ్మ, మీన, లక్ష్మి, పద్మా, ప్రకాష్, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


# 99.78 శాతం ఉత్తీర్ణతతో భద్రాద్రి గిరిజన విద్యార్థుల సరికొత్త చరిత్ర!

- అక్షర శిఖరాగ్రాన ఏకలవ్యులు



భద్రాచలం ఏప్రిల్ 16 (జన సంఘర్షణ)
భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన శిఖరాల నుండి అక్షర కిరణాలు ప్రసవిస్తూ, పదో తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో ఖమ్మం రీజియన్ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు అజేయమైన రికార్డును నెలకొల్పాయి. అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య అడివి బిడ్డలకు అందితే వారు ప్రపంచంతో పోటీ పడగలరని నిరూపిస్తూ, 99.78 శాతం ఉత్తీర్ణతతో ఈ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఐటీడీఏ పీవో బి.రాహుల్ వెల్లడించిన వివరాల ప్రకారం.. పరీక్షలకు హాజరైన 455 మందిలో 454 మంది విజయకేతనం ఎగురవేయగా, అందులోనూ ఎనిమిది పాఠశాలలకు గాను ఏడు పాఠశాలలు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించడం గమనార్హం. మరీ ముఖ్యంగా, బాలికలందరూ ఉత్తీర్ణత సాధించడం అనేది మారుమూల ప్రాంతాల్లో వస్తున్న విద్యా విప్లవానికి, మహిళా సాధికారతకు నిదర్శనంగా నిలుస్తోంది. కేవలం మార్కుల కోసమే కాకుండా, కఠినమైన సీబీఎస్ఈ సిలబస్‌లో పట్టు సాధించి, మెరుగైన ప్రతిభ కనబరిచిన 18 మంది విద్యార్థులను పీవో ప్రత్యేకంగా అభినందించడం వారిలో మరింత స్ఫూర్తిని నింపింది. సౌకర్యాలు కల్పిస్తే సత్తా చాటుతామని చాటిచెప్పిన ఈ విద్యార్థుల విజయం, ప్రభుత్వ విద్యారంగంపై నమ్మకాన్ని పెంచడమే కాకుండా, వెనుకబడిన వర్గాల ప్రతిభకు ఆకాశమే హద్దు అని నిరూపిస్తోంది.

# ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రేషన్ పై పిఎస్ లో ఫిర్యాదు




బోధన్ ఎడపల్లి/ఏప్రిల్16/(జన సంఘర్షణ)
బోధన్ ఎడపల్లి మండల కేంద్రంలో మంగళ్ పహాడ్‌లో ఆస్తి వివాదం చోటుచేసుకుంది. తనకు రావలసిన ఆస్తి తన భర్త అన్న సంజీవ్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ,గ్రామానికి చెందిన తగ్గేలా శ్యామల ఆరోపించింది. అక్రమ రిజిస్ట్రేషన్‌కు ఇన్చార్జ్ సబ్ రిజిస్టర్.(సీనియర్అసిస్టెంట్)వెంకటరమణ సహకరిస్తున్నారు. శ్యామల భర్త, సోదరి సుమలత, బోధన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలుతీ సుకోవాలని. లేనియెడల ఉన్నత అధికారులకు వద్దకు వెళ్తామని చెప్పడం జరిగింది.

# అనారోగ్యంతో ఉన్న మాజీ ఎంపీటీసీ దొడ్డిగర్ల సుందరం పరామర్శ

◆ **కామేపల్లి మండలంలో కాంగ్రెస్ నేతల ఆత్మీయ సందర్శనం**

ఇల్లెందు ప్రతినిధి( జన సంఘర్షణ)
కామేపల్లి మండలం కేంద్రంలో మాజీ ఎంపీటీసీ దొడ్డిగర్ల సుందరం అనారోగ్యంతో కొంతకాలంగా బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి కలిసి ఆయనను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సుందరం ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అజ్మీర నాగమణి, కృష్ణాపురం సర్పంచ్ అజ్మీర ద్వలి, గ్రామ అధ్యక్షుడు సీతారాములు, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి జగన్నాథ రెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మలపాటి సత్యమయ్య, నల్లమోతు వెంకట నరసయ్య, మార్కెట్ డైరెక్టర్ బ్వసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లె ప్రగతికి 'అంకిత్' అడుగుజాడలు

◆ **మోడల్ గ్రామాలే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ ప్రజాపాలన ప్రగతి బాట!**

కొత్తగూడెం ఏప్రిల్ 16 ( జన సంఘర్షణ)




అట్టడుగు స్థాయి నుంచి అభ్యున్నతి సాధించినప్పుడే జిల్లా సమగ్ర అభివృద్ధి సాధ్యమని నమ్మే జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాద్రి జిల్లాలోని ప్రతి పల్లెను ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నడుం బిగించారు. గురువారం జూలూరుపాడు మండల కేంద్రంలో నిర్వహించిన కీలక సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమం కాదని, అది క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న చిక్కుముడులను విప్పే ఒక శక్తివంతమైన ఆయుధమని స్పష్టం చేశారు. ఇప్పటికే గ్రామసభలు, సర్పంచుల శిక్షణ వంటి ప్రాథమిక ప్రక్రియలు విజయవంతంగా పూర్తి కావడంతో, ఇకపై సమస్యల పరిష్కారంలో వేగం పెరగాలని అధికారులకు కరాఖండిగా ఆదేశాలిచ్చారు. అధికారులు తమ కార్యాలయాలకే పరిమితం కాకుండా, ప్రజల ముంగిట ఉండి విధులు నిర్వహించాలని, ప్రతి గ్రామం మౌలిక వసతులతో కళకళలాడుతూ ఒక 'రోల్ మోడల్'గా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. పాలనలో జాప్యానికి తావులేకుండా, పారదర్శకతతో కూడిన ప్రజా సేవలే లక్ష్యంగా యంత్రాంగం కదలాలని కలెక్టర్ చేసిన సూచనలు.. జిల్లాలో రాబోయే విప్లవాత్మక మార్పులకు సంకేతంగా కనిపిస్తున్నాయి. అభివృద్ధి అనేది పైస్థాయి నుండి కాకుండా పల్లెల నుండే ప్రారంభం కావాలనే కలెక్టర్ ఆలోచనా విధానం ఇప్పుడు ప్రతి అధికారిలోనూ కొత్త ఉత్సాహాన్ని, బాధ్యతను నింపుతోంది.

# గోదావరి తీరాన 'ఎడారి' నిశ్శబ్దం

◆ **దక్షిణ అయోధ్యలో అడుగంటిన అక్షయధార.. భక్తుల గుండెల్లో ఆవేదన!**

భద్రాచలం ఏప్రిల్ 16 (జన సంఘర్షణ)




ఒకప్పుడు ఉత్తుంగ తరంగాలతో, నిండుకుండలా ఉప్పొంగుతూ భక్తుల పాపాలను కడిగేసిన పుణ్య గోదావరి.. నేడు ఎండల తీవ్రతకు, పాలకుల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా 'పిల్ల కాలువ'లా మారిపోవడం అత్యంత దయనీయం. దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలంలో మహానది గోదావరి తన సహజ వైభవాన్ని కోల్పోయి, కేవలం ఇసుక మేటలు, రాళ్ల గుట్టల మధ్య చిన్న చిన్న పాయలుగా విడిపోయి ఎడారిని తలపిస్తోంది. ఎగువ ప్రాంతాల నుండి రాకడ పూర్తిగా నిలిచిపోవడం, అగ్నిప్రేరిత సూర్యతాపానికి నీరు ఆవిరైపోవడంతో నదీ గర్భం అట్టడుగుకు చేరుకుంది. పుణ్యస్నానాలు ఆచరించడమే కాదు, కనీసం కాళ్లు కడుక్కోవడానికి కూడా నీరు దొరకని పరిస్థితి నెలకొనడం భక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. నది తన జీవకళను కోల్పోవడం కేవలం ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు, నదీ జలాల యాజమాన్యంలో జరుగుతున్న లోపాలకు ఇది ఒక హెచ్చరిక వంటిది. గలగలపారే గోదావరి గళం మూగబోతుంటే, రాబోయే రోజుల్లో తాగునీటి ఎద్దడి ఎంతటి విలయాన్ని సృష్టిస్తుందోనని స్థానికులు భయపడుతున్నారు. ప్రకృతి ప్రసాదించిన ఈ అక్షయధారను కాపాడుకోలేకపోతే, భవిష్యత్ తరాలకు మనం కేవలం ఇసుక దిబ్బలనే మిగిలిస్తామా? అన్న ప్రశ్న ఇప్పుడు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది.

# నడక దారిలో 'నిశ్శబ్ద' మరణం

◆ **ఇల్లందులో పాన్ షాపు యజమాని ప్రకాశ్ గుండెపోటుతో కన్నుమూత!**

ఇల్లందు ఏప్రిల్ 16 (జన సంఘర్షణ)



ఆరోగ్యమే మహాభాగ్యం అని భావించి ప్రతిరోజూ లాగే నడకకు వెళ్లిన ఆ వ్యక్తి.. తిరిగి రాని లోకాలకు వెళ్తారని ఎవరూ ఊహించలేదు. ఇల్లందు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో దశాబ్దాలుగా పాన్ షాపు నడుపుకుంటూ, అందరితో ఎంతో ఆత్మీయంగా మెలిగే ప్రకాశ్ (52) గురువారం ఉదయం అకస్మాత్తుగా సంభవించిన గుండెపోటుతో మరణించడం పట్టణంలో విషాదాన్ని నింపింది. ఉదయాన్నే జేకే గ్రౌండ్‌లో వాకింగ్ పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వస్తుండగా, ఒక్కసారిగా గుండెలో నొప్పి రావడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆయన ప్రాణాలు విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేరళ రాష్ట్రం నుండి జీవనోపాధి కోసం వలస వచ్చి, ఇల్లందునే తన సొంత ఊరుగా మార్చుకుని, ఇక్కడి మనుషులతో విడదీయలేని బంధాన్ని పెంచుకున్న ప్రకాశ్ మృతి స్థానికులను తీవ్రంగా కలచివేస్తోంది. అయితే, వ్యాయామం చేస్తున్న సమయంలోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఇప్పుడు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది. ఆధునిక కాలంలో వయసుతో సంబంధం లేకుండా చాపకింద నీరులా విస్తరిస్తున్న గుండెపోటు మరణాలు, మన జీవనశైలి, ఒత్తిడిపై పునరాలోచన చేయాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. నిన్నటి వరకు మన మధ్యే చిరునవ్వుతో తిరిగిన ప్రకాశ్ అకాల మరణం, ఇల్లందు వాసులకు ఒక తీరని లోటు.

# ఉషోదయ కాలేజీలో విద్యార్థుల ప్రభంజనం.. ఫిదా అయిన సీపీ!


బోధన్ ఉషోదయ కాలేజ్/ఏప్రిల్16/(జన సంఘర్షణ)
బోధన్ ఉషోదయ మహిళా కళాశాల ఇంటర్ విద్యార్థినుల ప్రతిభను నిజామాబాద్ సీపీ సాయి చైతన్య అభినందించారు. బోధన్ పట్టణంలోని ఉషోదయ కళాశాల ఇంటర్మీడియట్ మహిళా కళాశాల యందుబుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సీపీ సాయి చైతన్య పాల్గొని మాట్లాడారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసి తదితర కోర్సులలో అత్యుత్తమ మార్కులు సంపాదించిన విద్యార్థిని విద్యార్థులకు నేడు బోధన్ మండల కేంద్రంలోని డిగ్రీ కాలేజీ యందు సన్మానించి అభినందించిన శ్రీగౌరవనీయులు నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య, ఐపీఎస్. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ.. ఉషోదయ ఇంటర్ మహిళా విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సంపాదించడం ఎంతో అభినందనీయమని మరియు భవిష్యత్తులో అనేక ర్యాంకులు సాధించి కాలేజీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఎల్లవేళల తల్లిదండ్రులు కన్నటువంటి కలలను నిజం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తల్లిదండ్రులు కన్నటువంటి కలలు నిజం చేసినప్పుడే మన చదువుకు సార్ధకత అవుతుందని తెలిపారు. విద్యార్థులు చిన్నప్పటినుండి కష్టపడే గుణం ఉన్నప్పుడే త్వరితగతిన భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు స్థిరపడతారని తెలియజేశారు. కావున విద్యార్థులకు చిన్నప్పటి నుంచే కష్టపడేటటువంటి గుణం ఉండాలని అప్పుడే అనుకున్నటువంటి లక్ష్యాన్ని సాధిస్తారని తెలిపారు. అనంతరం రమాకాంత్ ఫంక్షన్ హాల్ యందు కాలేజీ అన్వాల్ డే సెలెబ్రేషన్స్ పాల్గొని అందులో విద్యార్థిని విద్యార్థులతో ట్రాఫిక్ నిబంధనకు సంబంధించినటువంటి ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని, రోడ్డు భద్రతా నియమాలు



పాటించినప్పుడే యాక్సిడెంట్లు తగ్గుదల పడతాయని, విద్యార్థులు చెడుమార్గానికి దూరముగా ఉండాలని డ్రగ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మరియు నేరాల నియంత్రణకు కూడా విద్యార్థి దశ నుండే కృషి చేయాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఉషోదయ డిగ్రీ కాలేజీ చైర్మన్ ప్రకాష్, డైరెక్టర్ దుష్యంత్, బోధన్ ఎసిపి శ్రీ శ్రీనివాస్, బోధన్ ఎస్.హెచ్.ఓ శ్రీ వెంకట్ నారాయణ తదితరులు పాల్గొనడం జరిగింది.

# వ్యక్తి అదృశ్యం

పోతంగల్ కొడిచర్ల/ఏప్రిల్16/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా, పోతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో బిర్లా గంగారం అనే వ్యక్తి అయిన వయసు (62) కులం (కురుమ) 04/04/2026 శనివారం నుంచి కనబడుట లేదని కుటుంబ సభ్యుల నియత్నం కోటగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు రాగా దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సునీల్ కుమార్ తెలిపారు.

# నిజామాబాద్ వ్యభిచార గృహంపై దాడి ముగ్గురు అరెస్ట్

నిజామాబాద్/ఏప్రిల్ 16/(జన సంఘర్షణ)




నిజామాబాద్ నగరంలో చంద్రశేఖర్ కాళీలో ఓఅద్దె ఇంట్లో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడి చేసినట్టు రూరల్ ఎస్ హెచ్ఓ. శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడిలో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న నాల్యం శ్రీనివాస్ పాపి భూదేవితో పాటు ఒక వీటుడిని, ఓ మహిళను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు.ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్ హెచ్ ఓ వివరించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం – బీసీ గర్ల్స్ హాస్టల్లో విద్యార్థిని మృతి





కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి/ఏప్రిల్16/(జన సంఘర్షణ)
కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి బీసీ గర్ల్స్ హాస్టల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని శ్రావణి (14) మృతి చెందారు. బీఆర్ఎస్ హయాంలో దేశానికే ఆదర్శంగా ఉన్న గురుకులాలు, నేడు తుగ్లక్ రేవంత్ నిర్లక్ష్యం వల్ల నిర్వీర్యం అవుతున్నాయి. బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాలిక కుటుంబ సభ్యులతో కలిసి బాన్సువాడ – కామారెడ్డి వెళ్లే రహదారిపై ధర్నాకు దిగిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్వ్, విద్యార్థిని శ్రావణి మరణానికి కారణమైన వారిని వెంటనే సస్పెండ్ చేసి, బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం అందించాలని జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. ధర్నాకు దిగిన సురేందర్ తో పాటు బీఆర్ఎస్ శ్రేణులను అరెస్టు చేసిన పోలీసులు ఇంతమంది విద్యార్థులు చనిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో కనీస చలనం రాకపోవడం నిజంగా సిగ్గుచేటు. దీనికి పూర్తి బాధ్యత విద్యాశాఖ మంత్రి కూడా అయిన రేవంత్ రెడ్డిదే.

# ప్రోటోకాల్ రగడ... వేదికపైకి ఆహ్వానించని సర్పంచ్

◆ **అధికారుల నిర్లక్ష్యానికి చాటిచూపుతున్న వైనం**

బీర్కూర్ /ఏప్రిల్16/(జన సంఘర్షణ)
స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మొదలుకొని, కిందిస్థాయి సిబ్బంది వరకు ప్రభుత్వ కార్య క్రమాలు జరిగినప్పుడు, కచ్చితంగా ప్రజాప్రతినిధుల చేత ఎందుకోబడ్డ ముఖ్యంగా గ్రామ సర్పంచ్, ఎంపీపీ, మార్కెట్ కమిటీ చైర్మన్, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు ప్రోటోకాల్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పాటించడం లేదన్న ఆరోపణలు ఎన్నో ఉన్నాయి. తప్పనిసరిగా ప్రజల చేత ఎన్నుకోబడ వార్డు మెంబర్ తో సహా ఎంపిపి, గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులు వేదికపై ఆహ్వానించాల్సి ఉంటుంది. తన పార్టీ పెద్దదిక్కు పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రోటకాల్ పాటించడం లేదని, బీర్కూర్‌లో కూడాస్థానిక ప్రజా ప్రతినిధులను చివరికి గ్రామ సర్పంచ్ని సైతం వేదికపై ఆహ్వానించకపోవడం గందరగోళ పరిస్థితికి దారితీసింది. ప్రోటోకాల్ పాటించకుండా అధికారులు నిద్రపోతున్నారా? అంటూ గ్రామ సర్పంచ్ ధర్మతేజ అధికారుల పనితీరుపై మండిపడ్డారు. ప్రభుత్వ కార్యక్రమాలు ఏది జరిగిన ముందుగా అధ్యక్షత వహించేది గ్రామ సర్పంచి కనీసం ఈ పరిజ్ఞానం స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కి గాని, స్థానిక ప్రజాప్రతినిధులకు గాని కలగకపోవడం పట్ల సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పోచారం.. ప్రోటోకాల్ ఎక్కడ? అనే శీర్షికన ఇటీవల మన( జన సంఘర్షణ )ప్రచురించడం జరిగింది. కానీ ఎమ్మెల్యే పోచారం రెడ్డి తన పంతం మాత్రం నెగ్గించుకుంటూనే వస్తున్నారు. తాను ఆశీస్సులైన వేదికపై ప్రోటోకాల్ లేని వ్యక్తులను ఆహ్వానించడం పట్ల సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. తనకు అధికారం ఉంది



తనను ఎవరు ఏమి చెయ్యలేరు అన్న ధీమగ పోచారం శ్రీనివాస్ రెడ్డి పనిచేస్తున్నారు. నియోజకవర్గంలో ఏ నాయకుడు ఎదగకుండా చూస్తూ, చివరికి మీడియాతో బాధితులు తమ బాధలను వెళ్ళగక్కుకున్నప్పటికీ. ప్రభుత్వం మాది... మేము ఏం చేసినా ఎవరు అడ్డు తగలకూడదు అన్న ధీమగ పోచారం శ్రీనివాస్ రెడ్డి పనిచేస్తున్నారు. ఒక ఎమ్మెల్యే అంటే నియోజకవర్గానికి బాస్. ఆ బాస్ నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు నిర్వహిస్తుంటారు. ఇలాంటి కార్యక్రమంలో ఏర్పాటు చేస్తున్న అధికారులు వేదికలపై తప్పనిసరిగా ప్రోటోకాల్ పాటించవలసి ఉంటుంది . కానీ పోచారం శ్రీనివాస్ రెడ్డి భయంకో భక్తితో ఆయన చెప్పిన విధంగా ఫ్లెక్సీలు తయారు చేయడం వాటిలో అధికారికంగా ప్రజా ప్రతినిధులు ఎన్నుకున్న నాయకులకు స్థానం కల్పించడం లేదు. అంతేకాకుండా ప్రభుత్వ కార్యక్రమాలు జరిగే సభలకు పార్టీలకు అతీతంగా వేదికపై ఆహ్వానించవలసి ఉంటుంది. వీటిని ఏమి లెక్కచేయకుండా, పోచారం శ్రీనివాస్ రెడ్డి తనను ఎవరు ఏం చేస్తారు? అన్న ధీమతో ఇష్ట రాజ్యాంగ ప్రోటకాల్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. గురువారం బీర్కూర్ లో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచులు ఆహ్వానించకుండా, ఇతరులను ఆహ్వానించడంతో గ్రామ సర్పంచ్ ధర్మతేజ, అధికారుల పనితీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గ్రామ ప్రథమ పౌరుడు అంటే తెలియదా అంటూ అధికారులకు ప్రశ్నించారు. అధికారుల నుంచి సర్పంచ్ చేసిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకుండా దాటివేశారు. చివరికి గ్రామ సర్పంచ్ ధర్మతేజతోపటు వార్డు మెంబర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు వేదికలపై ఆహ్వానించకపోవడం పట్ల ఈ విషయంపై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామని ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ధర్మతేజ మన (జన సంఘర్షణ) తో తన ఆవేదన వెలగక్కుకున్నాడు. బీర్కూర్లో గురువారం జరిగిన ప్రజా పాలన.. ప్రగతి పాలన అనే కార్యక్రమంలో భాగంగా బీర్కూర్లో జరిగిన గ్రామ పంచాయతీ ఆవరణలో గందరగోళ పరిస్థితి నెలకొంది.

జన సంఘర్షణ

శుక్రవారం 17 ఏప్రిల్ 2026

# రహదారి భద్రతకు ఎస్పీ రోహిత్ రాజు 'రక్షా కవచం'

◆ 'అరైవ్ అలైవ్' నినాదంతో ఇల్లందులో భారీ చైతన్య యాత్ర!

◆ రహదారి భద్రత - జీవన రక్ష

ఇల్లందు ఏప్రిల్ 16 (జన సంఘర్షణ)

జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల రక్కసిని తరిమికొట్టి, ప్రతి ప్రాణాన్ని కాపాడాలనే దృఢ సంకల్పంతో భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు చేపట్టిన 'అరైవ్ అలైవ్' ఉద్యమం ఇప్పుడు ఇల్లందు గడ్డపై ప్రకంపనలు సృష్టిస్తోంది. గురువారం ఇల్లందులో నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా, ఎస్పీ నేరుగా క్షేత్రస్థాయిలోకి వచ్చి వాహనదారులలో సామాజిక బాధ్యతను రగిలించారు. కేవలం పోలీస్ స్టేషన్లకే పరిమితం కాకుండా, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 'డిఫెన్సివ్ డ్రైవింగ్' సంస్కృతిని తీసుకెళ్లడమే లక్ష్యంగా ఆయన సాగిస్తున్న పోరాటం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది. ఈ సందర్భంగా అయిత ఫంక్షన్ హాల్‌లో జరిగిన సదస్సులో ఎస్పీ మాట్లాడుతూ.. "మీ ఇంటి వద్ద మీ కోసం ఎదురుచూసే కుటుంబ సభ్యులను గుర్తుంచుకోండి, హెల్మెట్ ధరించడం మీ ప్రాణాల






కోసమే" అంటూ చేసిన భావోద్వేగపూరిత ప్రసంగం సభికులను కదిలించింది. ఈ క్రమంలోనే సింగరేణి జీఎం కృష్ణయ్యతో కలిసి నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీ, డ్రైవర్లకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంటి పరీక్షలు ఎస్పీ దూరదృష్టికి నిదర్శనంగా నిలిచాయి. అతివేగం అనే అంధకారం నుండి వాహనదారులను రక్షించి, క్రమశిక్షణతో కూడిన ప్రయాణమే జీవన పరమార్థమని చాటిచెప్పిన ఈ కార్యక్రమం, జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజల భద్రత పట్ల ఎంతటి నిబద్ధతతో ఉందో చాటిచెప్పింది. పోలీసు, సింగరేణి, అటవీ శాఖల సమన్వయంతో సాగిన ఈ భారీ బైక్ ర్యాలీలో డీఎస్పీ వెంకన్న బాబు, సీఐ సురేష్, యువత పెద్ద ఎత్తున పాల్గొని, ఎస్పీ 'అరైవ్ అలైవ్' లక్ష్యాన్ని విజయవంతం చేస్తామని ప్రతిజ్ఞ పూనారు. మన ప్రయాణం గమ్యం చేరడానికే కానీ.. గాలిలో కలవడానికి కాదనే నిజాన్ని ఈ కార్యక్రమం మరోసారి ఇల్లందు ప్రజలకు గుర్తుచేసింది.

# గ్రామం అభివృద్ధి చెందాలంటే అధికారులు సక్రమంగా పనిచేయాలి

◆ వెంటనే అధికారులను నియమించండి

◆ ఆగ్రహం వ్యక్తం చేసిన.. ప్రజాప్రతినిధులు

◆ పోతంగల మండల కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాసరావు వాసు




పోతంగల్/ఏప్రిల్16/(జన సంఘర్షణ)

పోతంగల్ మండలంలోని ప్రతీ గ్రామంలో పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలని ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం మండల ప్రత్యేక అధికారి మున్ని నాయక్ అధ్యక్షతన నిర్వహించారు.మండలంలోని ప్రతీ గ్రామంలో పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలని ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం మండల ప్రత్యేక అధికారి మున్ని నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రజాప్రతినిధులు గ్రామంలోని సమస్యలను వివరించారు. అవసరమగు అధికారులు లేకపోవడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని సంక్షేమ పథకాలు అమలు కాకుండా తీవ్ర జాప్యం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ పాఠశాలలో బాలురకు బాలికలకు వేరువేరుగా మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని అన్నారు.మండలకేంద్రంలో సమీకృత భవనం భూమి పూజకు పరిమితమైందని, విషయంపై ఉన్నతాధికారులకు నివేదించి నిర్మాణ పనులు ప్రారంభించేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో విష్ణు, ఎంపీడీవో చందర్, ఎంఈఓ శంకర్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు షాజీ పటేల్, వ్యవసాయ అధికారి నిషిత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగాధర్, ఆయా శాఖల అధికారులు మండలంలోని గ్రామాల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉషోదయ కాలేజీలో విద్యార్థుల ప్రభంజనం..

బోధన్ :ఏప్రిల్ 16(జన సంఘర్షణ)

బోధన్ పట్టణంలోని ఉషోదయ మహిళా కళాశాల ఇంటర్ విద్యార్థినుల ప్రతిభను నిజామాబాద్ సీపీ సాయి చైతన్య అభినందించారు. బోధన్ పట్టణంలోని ఉషోదయ కళాశాల ఇంటర్మీడియట్ మహిళా కళాశాల యందుబుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సీపీ సాయి చైతన్య పాల్గొని మాట్లాడారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసి తదితర కోర్సులలో అత్యుత్తమ మార్కులు సంపాదించిన విద్యార్థిని విద్యార్థులకు గురువారం ఉదయం బోధన్ పట్టణంలోని డిగ్రీ కాలేజీ యందు సన్మానించి అభినందించిన నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ... ఉషోదయ ఇంటర్ మహిళా విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సంపాదించడం ఎంతో అభినందనీయమని భవిష్యత్తులో అనేక ర్యాంకులు సాధించి కాలేజీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఎల్లవేళల తల్లిదండ్రులు కన్నటువంటి కలలను నిజం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తల్లిదండ్రులు కన్నటువంటి కలలు నిజం చేసినప్పుడే మన చదువుకు సార్థకత అవుతుందని తెలిపారు. విద్యార్థులు చిన్నప్పటినుండి కష్టపడే గుణం ఉన్నప్పుడే త్వరితగతిన భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు స్థిరపడతారని తెలియజేశారు. కావున




విద్యార్థులకు చిన్నప్పటి నుంచే కష్టపడేటటువంటి గుణం ఉండాలని అప్పుడే అనుకున్నటువంటి లక్ష్యాన్ని సాధింస్తారని తెలిపారు. అనంతరం రమాకాంత్ ఫంక్షన్ హాల్ యందు కాలేజీ అన్వాల్ డే సెలెబ్రేషన్స్ పాల్గొని అందులో విద్యార్థిని విద్యార్థులతో ట్రాఫిక్ నిబంధనకు సంబంధించినటువంట ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. విద్యార్థులు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించినప్పుడే యాక్సిడెంట్లు తగ్గుదల పడతాయని, విద్యార్థులు చెడుమార్గానికి దూరముగా ఉండాలని డ్రగ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మరియు నేరాల నియంత్రణకు కూడా విద్యార్థి దశ నుండే కృషి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఉషోదయ డిగ్రీ కాలేజీ చైర్మన్ ప్రకాష్ మరియు డైరెక్టర్ దుష్యంత్, బోధన్ ఎసిపి శ్రీ శ్రీనివాస్, బోధన్ ఎస్.హెచ్.ఓ శ్రీ వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 'అరైవ్ అలైవ్' పిలుపునకు కౌన్సిలర్ శివ కిరణ్ వెన్నుదన్ను!

◆ పౌర బాధ్యతే ప్రాణ రక్ష.. 'అరైవ్ అలైవ్' నినాదంతో రోడ్డు భద్రతా విప్లవం సృష్టిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు!

◆ లైసెన్సు కాగితం కాదు.. నీ బాధ్యతే నీ కవచం

ఇల్లందు ఏప్రిల్ 16 (జన సంఘర్షణ)

ఒక ప్రజా ప్రతినిధి అంటే కేవలం తన వార్డు అభివృద్ధి పనులకే పరిమితం కాకుండా, ప్రజల ప్రాణ రక్షణ పట్ల కూడా అంతే బాధ్యత కలిగి ఉండాలని నిరూపిస్తున్నారు 22వ వార్డు కౌన్సిలర్ కోర్లపాటి శివ కిరణ్. గురువారం ఇల్లందు పట్టణంలోని అయిత కాంప్లెక్స్ వేదికగా భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు నేతృత్వంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన సదస్సులో శివ కిరణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎస్పీ ప్రతిష్టాత్మకగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్, తన వార్డు ప్రజలతో పాటు పట్టణ యువత అంతా రోడ్డు నిబంధనలు పాటించేలా చొరవ చూపడం విశేషం. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హక్కులతో పాటు బాధ్యతను గుర్తించినప్పుడే ప్రమాద రహిత సమాజం సాధ్యమని పేర్కొన్న తరుణంలో, శివ కిరణ్ గారు అధికారులతో కలిసి వాహనదారుల్లో చైతన్యం నింపేందుకు కృషి చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలను కలిగి ఉండటమే కాకుండా, మద్యం, డ్రగ్స్ వంటి మహమ్మారులకు దూరంగా ఉండి ప్రాణాలను కాపాడుకోవాలని అధికారుల గళానికి తన మద్దతును జోడించారు. మున్సిపల్ చైర్మన్ కిరణ్ మిత్ర, సింగరేణి జీఎం వీసం కృష్ణయ్య వంటి ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో.. స్థానిక నాయకుడిగా శివ కిరణ్ చూపిన చురుకైన భాగస్వామ్యం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. "అభివృద్ధి అంటే రోడ్లు వేయడమే కాదు, ఆ రోడ్లపై ప్రయాణించే మనుషుల ప్రాణాలను కాపాడటం కూడా" అనే రీతిలో సాగిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకన్న బాబు, సీఐ సురేష్ మరియు ఇతర ప్రముఖులు పాల్గొని కౌన్సిలర్ మరియు పోలీస్ శాఖ సాగిస్తున్న ఈ సంయుక్త పోరాటాన్ని అభినందించారు.



# అనారోగ్యంతో ఉన్న మాజీ ఎంపీటీసీ దొడ్డిగర్ల సుందరం పరామర్శ

◆ కామేపల్లి మండలంలో కాంగ్రెస్ నేతల ఆత్మీయ సందర్శనం



ఇల్లెందు ప్రతినిధి( జన సంఘర్షణ)

కామేపల్లి మండలం కేంద్రంలో మాజీ ఎంపీటీసీ దొడ్డిగర్ల సుందరం అనారోగ్యంతో కొంతకాలంగా బాధపడు తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి కలిసి ఆయనను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సుందరం గారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అజ్మీర నాగమణి, కృష్ణాపురం సర్పంచ్ అజ్మీర ద్వలి, గ్రామ అధ్యక్షుడు సీతారాములు, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి జగన్నాథ రెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మలపాటి సత్యమయ్య, నల్లమోతు వెంకట నరసయ్య, మార్కెట్ డైరెక్టర్ బ్వసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతకు 'నయన' ప్రదానం

◆ కలెక్టర్ అంకిత్ పర్యవేక్షణలో డ్రైవర్లకు పకడ్బందీగా కంటి పరీక్షలు!



కొత్తగూడెం ఏప్రిల్ 16 (జన సంఘర్షణ)

రహదారిపై వాహనం నడిపే డ్రైవర్ కంటి చూపు కేవలం ఆయన వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాదు, అది వందలాది మంది ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కవచం అనే నిజాన్ని జిల్లా యంత్రాంగం మరోసారి చాటిచెప్పింది. 'అరైవ్-అలైవ్' రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ స్వయంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆసుపత్రిలోని వివిధ పరీక్షా విభాగాలను అణువణువూ తనిఖీ చేసిన కలెక్టర్, వైద్య పరికరాల పనితీరు మరియు పరీక్షా విధానంపై సిబ్బందిని సుదీర్ఘంగా ఆరా తీశారు. కేవలం మొక్కుబడి తనిఖీలు కాకుండా, అత్యాధునిక సాంకేతికతతో డ్రైవర్లకు మెరుగైన వైద్య సేవలు అందాలని, ఏ ఒక్క చిన్న లోపం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీయకూడదని అధికారులను గట్టిగా ఆదేశించారు. రహదారి భద్రత అనేది కేవలం అవగాహన సదస్సులకు పరిమితం కాకుండా, ఇలా డ్రైవర్ల శారీరక దృఢత్వాన్ని, ముఖ్యంగా కంటి చూపును పరీక్షించడం ద్వారా మాత్రమే ప్రమాద రహిత జిల్లాగా భద్రాద్రిని తీర్చిదిద్దగలమని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కల్పిస్తున్న ఈ సౌకర్యాలను ప్రతి డ్రైవర్ సద్వినియోగం చేసుకోవాలని, అప్పుడే మన ప్రయాణాలు క్షేమంగా సాగుతాయని ఆయన చేసిన సూచనలు వాహనదారులలో ఆలోచన రేకెత్తించాయి. జిల్లా పాలనాధికారి స్వయంగా ఆసుపత్రి విభాగాలను సందర్శించి వైద్యులకు దిశానిర్దేశం చేయడం చూస్తుంటే, ప్రజల ప్రాణ రక్షణ పట్ల జిల్లా యంత్రాంగం ఎంతటి నిబద్ధతతో ఉందో స్పష్టమవుతోంది.

# ఆపదలో ఉన్న కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన మోహన్ రావు పాటిల్ ప్రజా ట్రస్ట్



భైంసా, ఏప్రిల్ 16 (జన సంఘర్షణ)

భైంసా: స్థానిక భైంసా పట్టణానికి చెందిన జాదవ్ సావిత్రి బాయి భర్త బాబురావు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మోహన్ రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పాటిల్ వారి కుటుంబాన్ని పరామర్శించి, నిత్య అవసరాల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పల్లె పల్లెకు బీజేపీ "గడప గడపకు మోహన్ రావు పాటిల్" కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో జాదవ్ సావిత్రి బాయి కుమారుడు గణేష్ కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. అలాగే, అనుకోని సంఘటనలు జరిగినప్పుడు తమ ప్రజా ట్రస్ట్ పేద, మధ్య తరగతి కుటుంబాలకు అండగా నిలిచి సహాయం చేయడంలో ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి పాలన పై ప్రత్యేక మండల స్థాయి సమావేశం

బీబీపేట్ ఏప్రిల్ 16 ( జన సంఘర్షణ)

కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండల కేంద్రంలో గల వాసవి క్లబ్ హాల్‌లో ప్రజా పాలన - ప్రగతి పాలనలో భాగంగా గురువారం ప్రత్యేక మండల స్థాయి సమావేశం మండల అభివృద్ధి అధికారి పూర్ణ చంద్రోదయ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న ఆయా పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, మండల తాసిల్దార్, మండల పంచాయతీ ఆఫీసర్, మండల వ్యవసాయ అధికారి, మండల విద్యాధికారి, ఐకెపి ఎపిఎం, ఐకెపి మండల అధ్యక్షురాలు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, బిక్నూర్ ఏఎంసీ చైర్మన్ పాత రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుతారి రమేష్, ఆయా గ్రామ సర్పంచులు,వార్డ్ మెంబర్లు ప్రజలు పాల్గొన్నారు.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం · తెలుగు దినపత్రిక
శుక్రవారం
17 ఏప్రిల్ 2026

# మైనార్టీలకే కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పోస్టు డిక్లేర్ చేయాలి

- అనేక ఏండ్ల నుంచి ముస్లింలకే కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పోస్టు ఇవ్వడం జరిగింది
- కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు ముస్లింలకే కన్వీనర్ పోస్ట్ ఇచ్చినప్పుడు అధికారంలోకి వచ్చినాక ఇతరులకు ఇవ్వడం పట్ల శ్రద్ధ చూపడం తగునా
- కోటగిరి సర్పంచ్ ఎన్నికల్లో మైనార్టీలదే కీలక పాత్ర
- రాబోయే జెడ్పిటిసి ఎంపీపీ, ఎంపిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే మైనార్టీలకే కన్వీనర్ పోస్టు ఇవ్వండి
- నిజామాబాద్ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎంఏ వహీద్ భాయ్



కోటగిరి/ఏప్రిల్16/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ పోస్టును అనేక సంవత్సరాల నుంచి ముస్లిం మైనార్టీలకే ఇవ్వడం జరిగిందని, ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కానీ ఇప్పుడు ముస్లింలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఇతరులకు ఇచ్చే అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నాయని ఇది ఎంతవరకు సమంజసం అని, ఇలా జరిగితే సహించేది లేదని నిజామాబాద్ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎం ఏ వహీద్ భాయ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రానప్పుడు ముస్లింలకు సుమారు 25 సంవత్సరాలు ఇచ్చినప్పుడు, అధికారంలో కాంగ్రెస్ పార్టీ వచ్చినాక ముస్లింలకు విస్మరించి ఇతరులకు ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నలు వర్షం కురిపించారు. కోటగిరి మండల కేంద్రంలో సర్పంచ్ ఎన్నికల్లో ముస్లింలది పాత్ర చాలా కీలకంగా మారిందని అన్నారు, రాబోయే జడ్పిటిసి ఎంపిటిసి ఎంపీపీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలవాలంటే మైనార్టీల ఓట్లే కీలకం అవుతుందని దీని దృష్టిలో పెట్టుకొని మైనార్టీ వర్గాల వారికే మండల కన్వీనర్ పోస్ట్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు లేనిపక్షంలో తగిన శాస్తి చెప్తామని ఆయన హెచ్చరించారు. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో పాటు ఢిల్లీ వరకు వినతి పత్రాలు అందజేయడం జరిగిందని అన్నారు.

# 'అరైవ్ అలైవ్', ఉద్యమంలో కౌన్సిలర్ అజ్మీరా వంశీ చైతన్య కిరణం!

- పౌర బాధ్యతే ప్రాణ కవచం ప్రజా రక్షణలో 'వార్డు' వారధి



ఇల్లందు ఏప్రిల్ 16 (జన సంఘర్షణ)

"హక్కులు అడిగే గొంతుకకు.. బాధ్యతను గుర్తించే గుండె కూడా ఉండాలి" – ఇదే అంశాన్ని ఇల్లందు గడ్డపై అత్యంత ప్రభావవంతంగా వినిపించారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు. గురువారం పట్టణంలోని అయిత కాంప్లెక్స్ వేదికగా, 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ఉత్సవాల సందర్భంగా పోలీస్, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' (ూాతీతీఱఙవ ూశ్రీఱఙవ) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత అనేది కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమం కాదని, అది ప్రతి పౌరుడి ప్రాణాలను కాపాడే ఒక గొప్ప సామాజిక విప్లవమని అభివర్ణించారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఆర్సీ వంటి పత్రాలను కలిగి ఉండటమే కాకుండా, మద్యం మరియు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఇతరుల ప్రాణాలకు హాని కలిగించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ మహా యజ్ఞంలో 22వ వార్డు కౌన్సిలర్ అజ్మీరా వంశీ భాగస్వామ్యం ప్రత్యేకంగా నిలిచింది. కేవలం వార్డు అభివృద్ధి పనులకే పరిమితం కాకుండా, తన వార్డు ప్రజల, పట్టణ యువత ప్రాణ రక్షణే పరమావధిగా ఆయన ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని అధికారుల గళానికి బలాన్ని చేకూర్చారు. "అభివృద్ధి అంటే కేవలం రోడ్లు వేయడం కాదు.. ఆ రోడ్లపై ప్రయాణించే మనుషుల ప్రాణాలు కాపాడటం కూడా" అనే రీతిలో వంశీ చూపిన చొరవ ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. మున్సిపల్ చైర్మన్ కిరణ్ మిత్ర, సింగరేణి జీఎం వీసం కృష్ణయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చరణ్ సింగ్ వంటి ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో.. స్థానిక యువ నాయకుడిగా అజ్మీరా వంశీ గారు చూపిస్తున్న సామాజిక స్పృహ అభినందనీయం. సెల్ ఫోన్ డ్రైవింగ్ మరియు సీటు బెల్ట్ లేని ప్రయాణాలను పూర్తిగా నివారించాలని, 'అరైవ్ అలైవ్' నినాదాన్ని ప్రతి ఇంటికి చేరవేయాలని అధికారులు చేసిన ఈ విజ్ఞప్తి ఇల్లందు పట్టణంలో కొత్త చైతన్యాన్ని రగిలించింది. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకన్న బాబు, సీఐలు సురేష్, సత్యనారాయణ ఇతర ప్రముఖులు పాల్గొని భద్రతాయుత భద్రాద్రికి బాటలు వేశారు.

# కేపీహెచ్‌బీ ఫిష్ మార్కెట్‌లో బినామీల దందాకు చెక్

- జీహెచ్ఎంసీ నుంచి మత్స్య శాఖకు మార్కెట్ నిర్వహణ బదిలీ
- అర్హులైన మత్స్యకారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకే దుకాణాలు కేటాయించాలి.
- పదేళ్లలో పేదల పేరిట సాగిన బినామీల దోపిడీపై ఆధారాలున్నాయి
- మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన కూకట్‌పల్లి కాంగ్రెస్ నేతలు.
- వారం రోజుల్లో మార్కెట్‌ను పరిశీలిస్తానని మంత్రి హామీ.



హైదరాబాద్ కూకట్‌పల్లి ప్రతినిధి అంజిబాబు,ఏప్రిల్ 16 (జన సంఘర్షణ):

కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ బాలాజీ నగర్ డివిజన్ లోని జీహెచ్ఎంసీ ఫిష్ మార్కెట్‌లో గత పదేళ్లుగా సాగుతున్న బినామీల దోపిడీకి ఎట్టకేలకు చెక్ పడింది. ఈ మార్కెట్ నిర్వహణను జీహెచ్ఎంసీ పరిధి నుంచి మత్స్య శాఖకు బదిలీ చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు బుధవారం రోజు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రిని కలిసిన వారిలో కూకట్‌పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్ కుమార్, ముదిరాజ్,గంగపుత్ర సంఘం అధ్యక్షుడు రాజు ముదిరాజ్, ఏఎంసీ డైరెక్టర్ ఫణీంద్ర కుమార్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కేపీహెచ్‌బీ ఫిష్ మార్కెట్‌ను స్వయంగా పరిశీలించి, శిథిలావస్థలో ఉన్న మార్కెట్ భవనానికి మరమ్మతులు చేయించాలని వారు మంత్రికి విన్నవించారు. మార్కెట్‌లోని దుకాణాలను కేవలం దళారులకే కాకుండా, అర్హులైన గంగపుత్రులు, ముదిరాజ్‌లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించి వారికి ఉపాధి కల్పించాలని కోరారు. నేతల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి వాకిటి శ్రీహరి కచ్చితంగా వారం రోజుల్లో మార్కెట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. గత పదేళ్లలో బినామీల దోపిడీ అనేది ప్రభుత్వ హయాంలో పాలకుల అండతో కేపీహెచ్‌బీ ఫిష్ మార్కెట్‌లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని నేతలు తీవ్రస్థాయిలో ఆరోపించారు. పేదల పేరుతో దుకాణాలు తీసుకుని, వాటిని తమ పార్టీకి చెందిన బినామీలకు కట్టబెట్టారని మండిపడ్డారు. నిబంధనల ప్రకారం జీహెచ్ఎంసీకి నెలకు కేవలం రూ. 1000 అద్దె చెల్లించాల్సి ఉండగా అక్రమార్కులు, బినామీలు మాత్రం వ్యాపారుల నుంచి నెలకు రూ. 15 వేల నుంచి రూ. 25 వేల వరకు దౌర్జన్యంగా వసూలు చేసి జేబులు నింపుకున్నారని విమర్శించారు. ఇందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు, సాక్ష్యాలు తమ వద్ద ఉన్నాయని వారు స్పష్టం చేశారు. గత జోనల్ కమిషనర్ మమత హయాంలోనే అధికారుల కనుసన్నల్లో ఈ అక్రమ దందా యథేచ్ఛగా సాగిందని వారు ఆరోపించారు. రెండేళ్ల పోరాటం ఫలించిందని మార్కెట్లో దళారుల అక్రమాలకు అడ్డుకట్ట వేసి, ఫిష్ మార్కెట్ నిర్వహణను మత్స్య శాఖకు అప్పగించాలంటూ టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బండి రమేష్ సహకారంతో గత రెండేళ్లుగా పెద్ద ఎత్తున పోరాటం చేశామని నేతలు గుర్తుచేశారు. సంబంధిత మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులను పలుమార్లు కలిసి విన్నవించిన ఫలితంగానే.. నేడు జీహెచ్ఎంసీ నుంచి మత్స్య శాఖకు మార్కెట్ బదిలీ జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. మార్కెట్ నిర్వహణను మత్స్య శాఖ పరిధిలోకి తేవడంతో, ఇకపై దళారీల ప్రమేయం లేకుండా నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

# దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసే దిశగా మోదీ ప్రభుత్వం అడుగులు వేస్తుంది

- భారతీయ జనతా పార్టీ కూకట్పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు.



హైదరాబాద్ కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, ఏప్రిల్ 16 (జన సంఘర్షణ):

మహిళా రిజర్వేషన్ బిల్లు, రాజ్యాంగ (131వ) సవరణ బిల్లు మరియు నియోజకవర్గాల పునర్విభజన డీలిమిటేషన్ వంటి కీలక బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టడంపై భారతీయ జనతా పార్టీ కూకట్పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాలను 850కి పెంచాలని మోదీ ప్రభుత్వం యోచిస్తోందని, తాజా జనాభా లెక్కల ఆధారంగా ఈ పునర్విభజన ప్రక్రియ చేపట్టనున్నారు. దీనివల్ల మహిళా రిజర్వేషన్ల అమలు సులభతరం అవుతుందని, రాష్ట్ర అసెంబ్లీల పరిధి కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. ఇక దక్షిణాది ప్రజలను విపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారమే పునర్విభజన జరుగుతోందని, ఇది దొడ్డిదారిలో చేస్తున్న ప్రక్రియ కాదని ఆయన స్పష్టం చేశారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు, ఒకే విలువ అనే ప్రాథమిక సూత్రం అమలు కావాలంటే పునర్విభజన అనివార్యమని ఆయన పేర్కొన్నారు. మోడీ నాయకత్వం వ్యూహం నాయకత్వ పటిమపై భారత ప్రజల్లో చెరగని విశ్వాసం ఉందని, ఈ మూడు కీలక బిల్లుల ప్రవేశపెట్టడంతో దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసే దిశగా అడుగులు వేస్తున్న మోదీ ప్రభుత్వానికి ఈ సందర్భంగా కాంతారావు ధన్యవాదాలు తెలిపారు.

# పిట్లం మండలంలో చలివేంద్రం ప్రారంభం

- డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం...



కామారెడ్డి జుక్కల్/ఏప్రిల్16/(జన సంఘర్షణ)

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం పిట్లం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సొసైటీ చైర్మన్ శపథం రెడ్డి తండ్రి, పరమ సంత్ పరమదయాళ్ ముకుందరెడ్డి మహారాజు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి అవసరం ఎంతో ముఖ్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ముకుందరెడ్డి మహారాజు సేవలను స్మరించుకుంటూ, వారి జ్ఞాపకార్థం చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్ రెడ్డికి ప్రమాణస్వీకారం

- శుభాకాంక్షలు తెలియజేసిన పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.



హైదరాబాద్ కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు,ఏప్రిల్ 16 (జన సంఘర్షణ):

పార్లమెంట్ లో నేడు నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన నిరంతర ప్రజా సేవకుడు,పెద్దలు వేం నరేందర్ రెడ్డి తెలంగాణ ప్రజల గురించి, సమస్యల గురించి పార్లమెంట్ లో రాష్ట్ర హక్కులు, నిధుల గురించి తెలంగాణ ప్రభుత్వం తరపున పోరాటం చేసి, రాజ్యసభలో తెలంగాణ వాణి మరింత బలంగా వినిపించి తెలంగాణ అభివృద్ధి వారి భాగస్వామ్యం మరింత ఉండాలని కోరారు. భవిష్యత్తులో ప్రజాసేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తెలంగాణ కాంగ్రెస్ నాయకులతో కలిసి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అండగా ఉంటా....

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్.




హైదరాబాద్ కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, ఏప్రిల్ 16 (జన సంఘర్షణ):

జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం రోజు డిసిసి అధ్యక్షుడిని సన్మానించిన అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి షామీర్పేట డివిజన్ అంతయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన టియుడబ్ల్యూజే రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశానికి డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ విచ్చేశారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్,జిల్లా ఆర్టిఏ మెంబర్ జయపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీష కృష్ణారెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, అలియాబాద్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్ లను మేడ్చల్ జిల్లా యూనియన్ అధ్యక్షుడు, కార్యదర్శి బాలరాజు, వెంకట్రాంరెడ్డిల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి శాలువా కప్పి ఘనంగా మెమెంట్లతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు అండగా ఉంటానని అన్నారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, జిల్లా ఆర్టిఏ నెంబర్ జైపాల్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహ యాదవ్, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి,మూడు చింతల పల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, గుల్లపోచంపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి పేట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు సాధారణం ప్రతిభ అసాధారణం

- దాసరి నర్సింగ్ యాదవ్.



హైదరాబాద్ కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, ఏప్రిల్ 16 (జన సంఘర్షణ):

యువత క్రీడల్లో రాణించేందుకు అడ్డగుట్ట సొసైటీ జేఎన్టీయూ వద్ద విల్సన్ ఆధ్వర్యంలో '9కే స్పోర్ట్స్ క్లబ్' ప్రారంభమైంది. క్రీడా మెలుకువలను నేర్పిస్తూ యువతను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ క్లబ్ను కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సింగ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడల ద్వారా యువత శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా నిర్వాహకులు కోరారు. గ్రామీణ, నగర ప్రాంత క్రీడాకారులకు ఇది మంచి అవకాశమని వక్తలు పేర్కొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక

శుక్రవారం
17 ఏప్రిల్ 2026

## హున్సా గ్రామ పంచాయతీ కార్యాలయంలో 4 నలుగురు లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

బోధన్ హున్సా/ఏప్రిల్16/(జన సంఘర్షణ)



మన హున్సా గ్రామ పంచాయతీ కార్యాల యంలో 4 నలుగురు లబ్దిదారులకు ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాలూర మండల కాంగ్రెస్ అధ్యక్షులు మందర్న రవి,హున్స గ్రామ సర్పంచ్ మర్కల్ శివకుమార్, ఉప సర్పంచ్ తుడిమే నగేష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శమి శంకర్ , మాజీ ఎంపీటీసీ సభ్యులు మరిగే శివకుమార్, బాదే గంగారాం, ఆత్మ కమిటీ సభ్యులు వల్లకొండ నాని, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దేశిపేట్ ప్రకాష్, కచకాయల శివకుమార్, చీల ప్రకాష్, జీపీవో సంగమేశ్వర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ్ డిజేబుల్ పర్సన్స్ ఆశ్రమానికి నిత్యవసర వస్తువుల పంపిణీ

- పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర పౌర హక్కుల పరిరక్షణ సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నిమ్మగాళ్ల అర్జున్.

హైదరాబాద్ కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, ఏప్రిల్ 16 (జన సంఘర్షణ):




కూకట్పల్లి ప్రెస్ రిపోర్టర్ సామాజిక వేత తెలంగాణ రాష్ట్ర పౌర హక్కుల పరిరక్షణ సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నిమ్మగాళ్ల అర్జున్ పుట్టినరోజు సందర్భంగా షాపూర్ నగర్, హెచ్ఎంటి కాలనీ నిర్మాణ్ డిజేబుల్ పర్సన్స్ ఆశ్రమానికి నిత్యవసర వస్తువులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోమగల్ల మోజస్, నల్లోల రాము, పోనల్ల నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించే దిశగా ముందుకు సాగాలి

- సొంత నిధులతో వారికి కుట్టుమిషన్లు పంపిణీ చేసిన కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు.

హైదరాబాద్ కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, ఏప్రిల్ 16 (జన సంఘర్షణ):



మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించే దిశగా ముందుకు వెళ్లాలని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం రోజు ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సొంత నిధులతో వారికి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం కూకట్పల్లి దయార్గూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఖార్డ్ సంస్థ చైర్మన్ సుమన్,మధులత దంపతులు,కూకట్పల్లి సీతారామచంద్ర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ తులసీరావ్, సంతోష్, ప్రభాకర్, బొట్టు విష్ణు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం..

- మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్.

హైదరాబాద్ శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, ఏప్రిల్ 16 (జన సంఘర్షణ):



శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్ర బోస్ నగర్ కాలనీ గల్లీలో డ్రైనేజీ లైన్ నిత్యం పొంగుతూ సమస్యగా ఉందని కాలనీ వాసులు డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా వెంకటేష్ గౌడ్ సుభాష్ చంద్రబోస్ కాలనీలో పర్యటించి, సమస్యను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో నివాసాలు పెరిగి, డ్రైనేజీ లైన్ చిన్నగా ఉండడంతో నిత్యం నిండిపోతు సమస్య ఏర్పడిందని అన్నారు. ఈ నేపథ్యంలో సుభాష్ చంద్రబోస్ కాలనీ డ్రైనేజీ సమస్యను శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి త్వరలో పెద్ద డ్రైనేజీ లైన్ ను నిర్మించి, వెంటనే సీసీ రోడ్డు కూడా శాంక్షన్ చేయించి సమస్యను పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, గోపాల్, పోశెట్టిగౌడ్, లింగం, సుధాకర్, నాగార్జున, షేక్ బీబీ, నాగరాజు, ఖలీమ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 18న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- నూతన యూత్ కాంగ్రెస్ కమిటీకి ఘనంగా సన్మానం
- ముఖ్యఅతిథిగా హాజరై అభినందించిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్.

హైదరాబాద్ కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, ఏప్రిల్ 16 (జన సంఘర్షణ):




జిల్లా పార్టీలో జరిగే ఏ నియామకంలోనైనా కూకట్పల్లి నియోజక వర్గానికి అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి సలీం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఇటీవల ఎంపిక చేయడం జరిగింది. ఇందులో పదవులు పొందిన వారందరినీ గురువారం కూకట్పల్లి పార్టీ కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై వారిని అభినందించారు. ఎన్నిక ఏదైనా గెలుపే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ పని చేయాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి మరింతగా కృషి చేసి ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు ముందు ఉండాలని సూచించారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రధాని మోడీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎన్ ఎస్ యు ఐ ఇచ్చిన పిలుపుమేరకు ఏప్రిల్ నెల 18న నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రమేష్ ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు తెలియజేశారు.

## మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్ కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, ఏప్రిల్ 16 (జన సంఘర్షణ):



కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం బాలానగర్ డివిజన్ పరిధి రాజు కాలనీలోని కమ్యూనిటీ హాల్లో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ అందిస్తున్న ఖార్డు సంస్థ అధినేత సుమన్ మల్లాది దంపతులును అభినందించారు. మహిళలు ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధి సాధించి ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ దేశానికి మంచి పేరు తీసుకురావడమే కాకుండా ప్రపంచ స్థాయిలో తమ సత్తా చాటుతున్నారని కొనియాడారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్నానంతరం ప్రశంసా పత్రంతో పాటు ఉచితంగా కుట్టు మిషన్ కూడా అందిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. అనంతరం చరబండ రాజు నగర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కార్డు సంస్థ వారు ఏర్పాటు చేసిన సైన్స్ లాబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లలతో పాటు పెద్దలు కూడా టెక్నాలజీ తెలుసుకుంటూ ముందుకు వెళ్లాలని, నేడు విద్యార్థులను కూడా తల్లిదండ్రులు శాస్త్ర సాంకేతిక రంగాలు క్రీడల్లో పిల్లలకు ఎలాంటి నైపుణ్యం ఉందో గుర్తించి అందులోనే వారిని ప్రోత్సహిస్తే దేశానికే కాక ప్రపంచానికే వెన్నుముకగా నిలుస్తారని అనడంలో సందేహం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కార్డ్ సంస్థ వ్యవస్థాపకులు సుమన్ మల్లాది, మదులత మల్లాది, సంస్థ సభ్యులు లక్ష్మణ్, ఖాజా, మహిళలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులను తొలగించడం ఎంతో బాధ కలిగిస్తుంది

- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు.

హైదరాబాద్ కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, ఏప్రిల్ 16 (జన సంఘర్షణ):

బతుకు జీవుడా అంటూ పొట్ట చేత పట్టుకుని నగరానికి వచ్చిన నిరుపేదలపై రేవంత్ రెడ్డి సర్కారు పగ పట్టినట్టు వ్యవహరిస్తోందని, కూకట్పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్, బోరబండ, కే పి హెచ్ బి డివిజన్లో ప్రభుత్వ అధికారులు రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకునే నిరుపేదలపై తమ ప్రతాపం చూపడం ఎంతో బాధ కలిగిస్తుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన కేపిహెచ్బి డివిజన్లోని పలు ప్రాంతాల్లో ఇటీవల ఫుట్పాత్ లపై వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులను తొలగించడం వారు మానసికంగా ఎంతో కృంగిపోవడంతో వారికి అండగా నిలబడేందుకు ఆ ప్రాంతాలను పరిశీలించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో చాయి బండి, పళ్ళు, పువ్వులు, భోజనాలు అమ్ముకునేవాళ్లు ఉన్నారు అని వాళ్ళ బతుకుదెరువు అదేనని వారికి కుటుంబాలు ఉంటాయని కనీసం మానవత్వం లేకుండా ప్రత్యామ్నాయం కూడా చూపకుండా అర్ధాంతరంగా వారిని నడిరోడ్డుపై కట్టుబట్టలతో నిలబడితే పరిస్థితి ఏంటి అని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడం తప్ప సరైన న్యాయం వారికి జరగడంలేదని.. గతంలో ఐడియల్ చెరువు అభివృద్ధి విషయంలో



అక్కడ చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గం చూపించామని గుర్తు చేశారు. కానీ నేడు ఆ భరోసా ఈ నిరుపేదలకు రావడం లేదని అన్నారు. ఎవరైతే కాంగ్రెస్ నాయకులు ఉంటారో వారికి సంబంధించిన వ్యక్తులను కొనసాగించడం ఇతరులను తొలగించడం విడ్డూరంగా ఉందని ఇప్పటికైనా రేవంత్ రెడ్డి సర్కారు నిరుపేదలకు ప్రత్యామ్నాయ మార్గం చూపించకపోతే జిహెచ్ఎంసి కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేస్తానని ఎట్టి పరిస్థితుల్లో నిరుపేదలను కాపాడాలని వారికి అండగా నేనుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ జోన్ ఫెస్టివల్‌లో సాయికిరణ్ ప్రతిభ,విశ్వవిద్యాలయంలో సత్కారం

- సౌత్ జోన్ ఫెస్టివల్‌లో సాయికిరణ్ ప్రతిభకు ఘన గుర్తింపు.

హైదరాబాద్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి అంజిబాబు, ఏప్రిల్ 16 (జన సంఘర్షణ):

సూరవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం థియేటర్ ఆర్ట్స్ విభాగంలో అభ్యసిస్తున్న విద్యార్థి బి. సాయికిరణ్ ప్రతిభతో మరోసారి గుర్తింపు పొందారు. గత సంవత్సరం డిసెంబర్‌లో చెన్నైలో నిర్వహించిన సౌత్ జోన్ ఫెస్టివల్ లో సాయికిరణ్ వన్ యాక్ట్ ప్లే, మైమ్, క్రియేటివిటీ కొరియోగ్రఫీ విభాగాల్లో పాల్గొన్నారు. అందులో వన్ యాక్ట్ ప్లేలో నాలుగో స్థానం సాధించగా, మైమ్‌లో ప్రధాన పాత్ర పోషించి నాలుగో స్థానం పొందారు. ఈ సందర్భంగా గురువారం రోజు సూరవరం ప్రతాపరెడ్డి తెలుగు



విశ్వవిద్యాలయంలో మహనీయుల జయంతి వేడుకల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు చేతుల మీదుగా సాయికిరణ్ సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతు రావు, సినీ నటుడు ప్రదీప్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ కృపాకర్ పాల్గొన్నారు. విద్యార్థి సాయికిరణ్ సాధించిన విజయానికి విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులు, వివిధ విభాగాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co